RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 81 మంగళవారం 04 - 11 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

# రంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం

- ఆర్టీసీ బస్సు-టిప్పర్ ఢీ
- ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి
- పలువురు ప్రయాణికులకు గాయాలు
- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ప్రమాదం
- ఆర్టీసీ బస్సును ఢీకొని, మీద పడిన కంకర లారీ
- మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లతో పాటు మహిళలు, చిన్నారి
- ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు, ముగ్గురి పరిస్థితి విషమం
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు అందులో కూరుకుపోయారు. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని జేసీబీ సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీశారు. - మిగతా 2 లో

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో

# రాజకీయం తగదు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్న రేవంత్ రెడ్డి
- టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు పూర్తి చేయడం కష్టంగా మారిందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ హయాంలో 10 కిలోమీటర్లు కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శ



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేయడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూలు జిల్లా మన్నెవారిపల్లెలో పర్యటించిన ముఖ్యమంత్రి, హెలీ మాగ్నటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్, ఆధునాతన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ - మిగతా 2 లో

# రోడ్డుపై టిప్పర్ బీభత్సం


## 12 వాహనాలను ఢీకొట్టిన డంపర్ 3మంది దుర్మరణం




- జైపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- మద్యం మత్తులో డంపర్‌తో బీభత్సం సృష్టించిన డ్రైవర్
- ప్రమాదంలో 12 మంది దుర్మరణం, 50 మందికి గాయాలు
- 24 గంటల వ్యవధిలో రాజస్థాన్‌లో ఇది రెండో పెను ప్రమాదం
- సీసీటీవీ కెమెరాల్లో రికార్డైన ప్రమాద దృశ్యాలు
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# ఏఐతో ఉద్యోగాలకు ముప్పు.. ప్రతి పది మందిలో నలుగురిలో భయం

- ఏఐతో ఉద్యోగాలకు ముప్పు తప్పదంటున్న సర్వే
- సగం మంది మిలీనియల్స్‌లో తీవ్రమవుతున్న ఉద్యోగ భయం
- వచ్చే 3-5 ఏళ్లలో ఉద్యోగాలు పోతాయని ఆందోళన
- ఏఐ లేని కంపెనీల్లోనే ఉద్యోగుల్లో ఎక్కువ అభద్రత
- భయపడే వారిలో 40 శాతం మంది ఉద్యోగం మారే ఆలోచన



దేశవ్యాప్తంగా కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో, ఉద్యోగుల్లో సరికొత్త ఆందోళన మొదలైంది. రానున్న మూడు నుంచి ఐదేళ్లలో ఏఐ కారణంగా - మిగతా 2 లో

# ‘మీ బోధనా శైలి అద్భుతం’

- పాతపట్నం టీచర్‌ను మెచ్చుకున్న నారా లోకేశ్
- పాతపట్నం మోడల్ స్కూల్ టీచర్‌ను అభినందించిన మంత్రి నారా లోకేశ్
- బోటనీ టీచర్ బల్లెడ అప్పలరాజుపై ట్విట్టర్‌లో ప్రశంసలు
- కళాత్మకంగా, విజ్ఞానవంతంగా బయాలజీ ల్యాబ్‌ను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు
- సైన్స్, నైతిక విలువలతో ల్యాబ్‌కు కొత్త రూపు
- గ్రామీణ విద్యకు అప్పలరాజు మాస్టారు స్ఫూర్తిదాయకం అన్న లోకేశ్
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని వెల్లడి



ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఒక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై ప్రశంసల వర్షం కురిపించారు. వినూత్న బోధనా పద్ధతులతో విద్యార్థులను ఆకట్టుకుంటున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్ బోటనీ టీచర్ బల్లెడ అప్పలరాజును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇందుకు సంబంధించిన 27 సెకన్ల వీడియోను - మిగతా 2 లో

# నైజీరియాపై సైనిక చర్యకు ట్రంప్ సంకేతాలు

- క్రైస్తవుల హత్యలపై తీవ్ర ఆగ్రహం
- నైజీరియాపై సైనిక చర్యకు సిద్ధమవుతున్న అమెరికా
- దేశంలో క్రైస్తవుల హత్యలపై ట్రంప్ తీవ్ర ఆందోళన
- వైమానిక దాడులు లేదా బలగాలను పంపే యోచన
- మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్న దేశాల జాబితాలో నైజీరియా
- ఇటీవల ‘ప్రత్యేక ఆందోళన కలిగించే దేశాల’
- జాబితాలో నైజీరియాను చేర్చిన అమెరికా




# మరో ఆరు నెలలు కాల్పుల విరమణ



**సిపిఐ (మావోయిస్టు) అధికార ప్రతినిధి జగన్**

**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** కాల్పుల విరమణను మరో 6 నెలల పాటు కొనసాగిస్తున్నామని సిపిఐ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ తెలిపారు. దీనికి సంబంధించి ఓ లేఖను విడుదల చేశారు.గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్దఎత్తున ఉద్యమాలు చేసారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించింది. ఈ క్రమంలో గత మే నెలలో మేము 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించామని,ఈ 6 నెలల కాలంలో అనుకున్న పద్ధతులను మా వైపు నుండి అమలు జరిపి శాంతియుత వాతావరణం కొనసాగేలాగా వ్యవహరించామని పేర్కొన్నారు. ఇదే శాంతియుత వాతావరణం కొనసాగాలని తెలంగాణ సమాజం కోరుకుంటున్నదని, అందుకోసం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నామని తెలిపారు. గతంలో కొనసాగిన విధంగానే మా వైపు నుండి శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషిచేస్తాము. ప్రభుత్వం వైపు నుండి కూడా గతంలో వ్యవహరించిన విధంగానే ఉండాలని కోరుతున్నాము.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేయుటకు ప్రయత్నాలు చేస్తున్నది. ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, అన్ని సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతున్నామని వెల్లడించారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో

# హిందూజా గ్రూప్ కీలక ఒప్పందం

- హిందూజా గ్రూప్‌తో ఒప్పందం కుదిరింది
- లండన్ నుంచి సీఎం చంద్రబాబు ప్రకటన
- రాష్ట్రంలో రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్న సంస్థ
- లండన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ
- విశాఖలో 1,600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ విస్తరణ
- రాయలసీమలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు
- కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఈవీ బస్సుల తయారీ యూనిట్



ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఇంధన రంగాల అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రముఖ పారిశ్రామిక సంస్థ హిందూజా గ్రూప్‌తో రూ.20,000 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు లండన్ నుంచి ప్రకటించారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతితో పాటు స్వచ్ఛ ఇంధన వనరుల అభివృద్ధి వేగవంతం కానుంది.ఈ ఒప్పంద కార్యక్రమంలో హిందూజా గ్రూప్ ఛైర్మన్ అశోక్ పి. హిందూజా, హిందూజా గ్రూప్ యూరప్ ఛైర్మన్ ప్రకాశ్ హిందూజా, హిందూజా ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈవో వివేక్ నందాతో చర్చలు జరపడం ఆనందంగా ఉందని చంద్రబాబు తెలిపారు. ఈ పరివర్తనాత్మక భాగస్వామ్యం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

- మిగతా 2 లో

# సంపాదకీయం

## ఉచ్చుల్లో విఫల రాష్ట్రం

బిహార్ గురించి మాట్లాడడమూ లేదా రాయడమూ బాధాకరమైన విషయమే. స్వతంత్ర భారతదేశంలో బిహార్ కథ సంపూర్ణ నిర్లక్ష్యం, వ్యర్థ ప్రగల్భాల చరిత్రే. 1947లో భారతదేశ సమస్త రాష్ట్రాలు ఒకే ప్రారంభ స్థానంలో ఉన్నాయి. స్వాతంత్ర్య వేళ, లేదా భారత గణతంత్ర రాజ్యం ప్రభవించిన పొద్దులో తమను వెనుకనే వదిలివేసి స్వతంత్ర దేశం ముందుకు సాగిపోయిందని ఏ రాష్ట్రమూ చెప్పదు, చెప్పలేదు. నాడు కేంద్రంలోనూ, దాదాపుగా అన్ని రాష్ట్రాలలోనూ అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కనుక దేశవ్యాప్తంగా ఎల్లెడలా ఒకే విధానాలు, కార్యక్రమాలు అమలయ్యాయి. నిజానికి కొన్ని ప్రగతిశీల భావాలను తొలుత బిహార్‌లోనే ప్రయోగాత్మకంగా అమలుపరిచారు. అవి అక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు విస్తరించాయి. భూ సంస్కరణలు, భూముల పంపిణీ అందుకు ఉదాహరణలు. ప్రజాహితాన్ని ఔదలదాల్చిన నాయకులు బిహార్‌లో ఉండేవారు. సుపరిపాలనను సమర్థంగా అందించిన పాలనా వ్యవస్థ, దీక్షాదక్షతలతో తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించిన సివిల్ సర్వెంట్లు ఉండేవారు. దేశంలోనే మహా సస్యశ్యామల క్షేత్రాలు బిహార్‌లో ఉండేవి. ఆరు రుతువుల్లోనూ నిండుగా ప్రవహించే జీవనది గంగమ్మ చెంతనే ఉన్నది. సహజ వనరులు అపారం. భారత్‌లో తొలి ఉక్కు కర్మాగారాలు అవిభక్త బిహార్‌లోనే ప్రారంభమయ్యాయి. దేశంలోని నాలుగు ప్రముఖ హైకోర్టుల్లో ఒకటి పట్నాలో ఉండేది. దృఢమైన న్యాయవ్యవస్థ వర్ధిల్లేది. మరి బిహార్ ఎందుకు విఫలమయింది? బిహార్‌పై అధికారిక సమాచారం మహా నిరుత్సాహం కలిగిస్తుంది. వాస్తవ పరిస్థితులు అంతకంటే అధ్వానమైనవని పరిశీలకులు ఘంటాపథంగా చెప్పుతారు. ఈ శోచనీయ పరిస్థితులకు ప్రతి ప్రభుత్వమూ నిందార్హమైనదే. నితీశ్‌కుమార్ నవంబర్ 24, 2005 నుంచి ముఖ్యమంత్రిగా ఉన్నారు. (మధ్యలో 278 రోజులు మినహా. ఆ స్వల్పకాలిక ముఖ్యమంత్రిని నితీశ్ స్వయంగా ఎంపిక చేశాడు). అంటే నితీశ్ 20 సంవత్సరాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన తరువాత సుదీర్ఘకాలం పాలించిన నేత లాలూప్రసాద్ యాదవ్ (లేదా ఆయన సతీమణి) 1990 నుంచి 2005 దాకా బిహార్‌లో లాలూ పాలన నడిచింది. 35 సంవత్సరాల వయసులోపు బిహారీలకు ఒకే ఒక్క ముఖ్యమంత్రి%-% నితీశ్ కుమార్%-% మాత్రమే తెలుసు. బిహార్ అసెంబ్లీకి ఇప్పుడు జరగనున్న ఎన్నికలు 1990ల నాటి లేదా అంతకు ముందటి సంవత్సరాలలోని ప్రభుత్వాల గురించి కాదు. నితీశ్ నాయకత్వం, ఆయన ఇరవై సంవత్సరాల పాలనపై 2025 ఎన్నికలలో బిహారీలు తీర్పు ఇవ్వనున్నారు. 2025లో బిహార్ జనాభా 13.43 కోట్లు అని అంచనా. 1 కోటి నుంచి 3 కోట్ల మంది బిహారీలు తమ రాష్ట్రం వెలుపలి ప్రాంతాలకు వలసపోయారని అంచనా. బిహార్‌లో నిరుద్యోగిత, పేదరికానికి ప్రధాన కారణాలు: యువజనుల నిరుద్యోగిత రేటు 10.8 శాతం. విద్యాస్థాయి ఎంత ఎక్కువగా ఉంటుందో నిరుద్యోగిత రేటు కూడా అంత అధికంగా ఉండడం ఒక వైరుధ్యం. కేవలం 1,35,464 మంది బిహారీలు మాత్రమే తమ రాష్ట్రంలోని పరిశ్రమలలో ఉద్యోగులుగా ఉన్నారు.వీరిలో కేవలం 34,700 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు. భారతదేశంలో అత్యధిక పేదరికం రేటు బిహార్‌లో ఉందని 2024లో నీతిఆయోగ్ నివేదిక ఒకటి వెల్లడించింది. 64శాతం కుటుంబాల నెలసరి ఆదాయం పదివేల రూపాయల కంటే తక్కువగా ఉన్నది. నెలసరి ఆదాయం రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్న కుటుంబాలు 4శాతం మాత్రమే. మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎమ్‌పీఐ%-% ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలలో బహుళ లేమిని ఒకేసారి పరిశీలించడం ద్వారా పేదరికాన్ని అంచనా వేస్తుంది) అత్యంత చెత్త పనితీరు కనపరిచే రాష్ట్రం బిహార్. బిహార్ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులకు నితీశ్‌కుమార్ ప్రభుత్వానిదే బాధ్యత. భారత్ జనాభాలో 9శాతం బిహార్‌లో ఉండగా, స్థూల దేశీయోత్పత్తిలో ఆ రాష్ట్రం వాటా 3.07 శాతమే. 2023 – 24లో బిహారీల తలసరి ఆదాయం రూ.32,174 (జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1,06,744లో మూడో వంతు) మరింత ఆందోళనకరమైన విషయమేమిటంటే బిహార్ తలసరి ఆదాయం జాతీయ సగటు ఆదాయం పెరుగుదల రేటు కంటే తక్కువ రేటులో పెరుగుతోంది. రెండిటి మధ్య అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఆర్థికాభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నప్పటికీ బిహార్ పేద సమాజంగా, విఫల రాష్ట్రంగా ఎందుకు మిగిలిపోయింది? ఆ రాష్ట్ర రాజకీయాలే అందుకు కారణం, సందేహం లేదు. బిహార్ ప్రభుత్వమూ, దాని వ్యవస్థలూ తమకుతాము వేసుకున్న కులం, మతం ఉచ్చుల్లో చిక్కుకుపోయాయి.బిహార్ ప్రజలలో తీవ్ర విభేదాలకు మతం ఒక పెద్ద కారణం. రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్యంతో పరిపాలనలో ప్రతి అంశాన్ని మతం ప్రభావితం చేస్తోంది. ముస్లింలు నమ్మకద్రోహులు, కృతఘ్నులు అని, తత్కారణంగా వారి ఓట్లను తాను ఆశించడం లేదని గిరిరాజ్‌సింగ్ అనే బీజేపీ నేత వ్యాఖ్యానించాడు. ముస్లింలు 17శాతంగా ఉన్న రాష్ట్రంలో ఆయన ఈ వ్యాఖ్య చేశాడు మరి. బిహార్ ప్రజల పిచ్చాపాటీలో కులమే ప్రధాన అంశం. రాజకీయాల గురించిన చర్చ కూడా కులం చుట్టూనే నడవడం పరిపాటి. హిందువులు ఓబీసీలుగా, ఎమ్‌బీసీలుగా, ఈబీసీలుగా చీలిపోయి ఉన్నారు. ఈబీసీలలోని 12 కులాలలో నాలుగు మాత్రమే ప్రధానమైనవిగా పరిగణన పొందుతున్నాయి. కుల మతాలకు మితిమీరిన ప్రాధాన్యమివ్వడం వల్ల బిహార్ ప్రజలలో పరస్పర అనుమానాలు, విరోధ భావాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయి. బిహార్ రాజకీయాలలో మార్పు వచ్చి తీరాలి. ఆ మార్పును ఎవరు సాధిస్తారు? ఈ ప్రశ్నకు భిన్న సమాధానాలు వస్తాయి. మార్పును తీసుకువచ్చే నాయకుడు నితీశ్‌కుమార్ మాత్రం కానే కాదని ఇంగిత జ్ఞానం ఉన్న ప్రతి ఒక్కడూ చెప్పగలడు. ఆయన తన ఇరవై సంవత్సరాల పాలనా అలవాట్లలో పాదుకుని పోయివున్నాడు. అనూహ్య రీతుల్లో ప్రవర్తించడం ఆయనకు పరిపాటి. ఇప్పుడు ఆరోగ్య సమస్యలు కూడా ఆయనను చుట్టుముట్టాయి. నితీశ్ తనసుతాను మార్చుకుని బిహార్ పాలనలో, సమాజంలో మౌలిక మార్పులు తీసుకురాగలరని భావించడం, ఆశించడం మూర?త్వమే అవుతుంది. బీజేపీతో జత కట్టిన ప్రతి ప్రాంతీయ పార్టీ పతనమయింది. ఉనికినీ కోల్పో యింది. నితీశ్ నాయకత్వంలోని జనతాదళ్(యు) భవిష్యత్తు అందుకు భిన్నంగా ఉండదు. కులం కుటుంబానికే పరిమితమవ్వాలి. మతాన్ని పూజా ప్రదేశాలలోనే అనుష్ఠానించాలి. రాజకీయ వ్యవహారాలనూ పాలనా వ్యవస్థలనూ ఎట్టి పరిస్థితులలోనూ ప్రభావితం చేయకుండా కులమతాలను కట్టడి చేయాలి. బిహార్ ప్రజలు ఈ సత్యాన్ని గ్రహించి జాగృతమయినప్పుడే తమకుతాము వేసుకున్న ఆ ఉచ్చుల నుంచి బయటపడగలుగుతారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో హిందూజా గ్రూప్ కీలక ఒప్పందం

**మొదటిపేజీ తరువాయి** – ఈ ఎంవోయూలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో హిందూజా గ్రూప్ భారీ ప్రాజెక్టులను చేపట్టనుంది.విద్యుత్ ప్లాంట్ విస్తరణ (విశాఖపట్నం): విశాఖపట్నంలో ఇప్పటికే ఉన్న 1,050 మెగావాట్ల హెచ్‌ఎన్‌పీసీఎల్ ప్లాంట్ సామర్థ్యాన్ని అదనంగా మరో 1,600 మెగావాట్లు పెంచనున్నారు. పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే ఈ విస్తరణ ముఖ్య ఉద్దేశం.పునరుత్పాదక ఇంధనం (రాయలసీమ): రాయలసీమ ప్రాంతంలో భారీ సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధన సామర్థ్యం గణనీయంగా పెరగనుంది.ఈవీ తయారీ యూనిట్ (మల్లవల్లి, కృష్ణా): కృష్ణా జిల్లా మల్లవల్లిలో అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్ (రాష్ట్రవ్యాప్తంగా): ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను హిందూజా గ్రూప్ ఏర్పాటు చేయనుంది.ఈ భారీ పెట్టుబడులతో రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణం మరింత మెరుగుపడటంతో పాటు, స్థానికంగా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

## ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో రాజకీయం తగదు



**మొదటిపేజీ తరువాయి** – ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు.టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని అన్నారు. ఈ పనులపై రాజకీయం చేయవద్దని కోరారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని అన్నారు. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు పనుల అంచనా విలువ రూ. 1,986 కోట్లు అని, రెండు దశాబ్దాల్లో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడే నాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయిందని చెప్పారు.బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదన్నరేళ్లలో 10 కిలోమీటర్ల టన్నెల్ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. పెద్దగా కమీషన్లు రావని ఈ టన్నెల్‌ను పక్కకు పెట్టారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ అప్పుడు చూస్తూ ఊరుకున్నారని ఆరోపించారు. రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీరు అందేదని చెప్పారు. కృష్ణానది మీద చెపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.బీఆర్‌ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు రూ. 1.86 లక్షల కోట్లు చెల్లించారని, ఆ మొత్తంలో కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ. 1.06 లక్షల కోట్లు చెల్లించారని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ప్రాజెక్టులు నిర్మిస్తే, కేసీఆర్ మాత్రం ఏమీ నిర్మించలేకపోయారని మండిపడ్డారు.

# రంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి** – ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో చదువుతున్నట్లు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి తిరిగి నగరానికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. చేవెళ్ల ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల పరిహారం అందించనున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్?బాబు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు, ఆర్టీసీ తరఫున రూ.2 లక్షల పరిహారం అందించనున్నారు.మృతుల బంధువుల విజ్ఞప్తి మేరకు చేవెళ్లలోనే శవపరీక్షలు నిర్వహించారు. శవపరీక్ష పూర్తయిన మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నారు. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో 19 మృతదేహాలకు శవపరీక్షలు నిర్వహించారు. అనంతరం అధికారులు మృతదేహాలను స్వస్థలాలకు పంపుతున్నారు.మృతుల వివరాలు: వికారాబాద్ జిల్లాకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ దస్తగిరిబాబా (35), మహారాష్ట్రకు చెందిన టిప్పర్ డ్రైవర్ ఆకాశ్ కామ్లే, వికారాబాద్ శ్రీరామ్‌నగర్ తండా వాసి తారాబాయ్ (45), హైదరాబాద్ బోరబండకు చెందిన కల్పన (45), భానూరుకు చెందిన బచ్చన్ నాగమణి (55), దౌల్తాబాద్ మండలానికి చెందిన మల్లగండ్ల హనుమంతు (35), యాలాల మం. లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిల రెడ్డి (22), హైదరాబాద్ బోరబండకు చెందిన గోగుల గుణమ్మ (60), తాండూరుకు చెందిన షేక్ ఖలాద్ హుస్సేన్ (76), తాండూరు వాసులు తాబస్సుమ్ జహాన్ (38), తాలియా బేగం, తాండూరుకు చెందిన సాయిప్రియ, నందిని (18), తనూష, కోఠి కళాశాలలో చదువుతున్న తాండూరుకు చెందిన ముస్కాన్ (21), యాలాల మండలం హాజీపురాకు చెందిన బండప్ప (42), పది నెలల చిన్నారి మృతి చెందారు.క్షతగాత్రుల వివరాలు: చేవెళ్ల ఘటనలో 24 మందికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో 14 మందికి, వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో పది మందికి చికిత్స అందిస్తున్నారు. మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో బస్సు కండక్టర్ రాధ (45), పీఎంఆర్ ఆస్పత్రిలో శ్రీసాయి (27), అనసూయ (45), హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్, నందిని (21), జగదీష్ (28), బుజ్జిభాయ్ (36), నాగమణి (50), బస్వరాజు (39), బి.శ్రీనివాస్ (31), అబ్దుల్ మజీద్ (42), అఖిల్ ఖాన్ (35), దయాకర్ (25), అబ్దుల్ రజాక్ (38) చికిత్స పొందుతున్నారు.ఇక వికారాబాద్ ప్రభుత్వాస్పత్రిలో 10 మంది బాధితులకు చికిత్స అందిస్తున్నారు. వారిలో సుమయ (26), అబ్దుల్లా (33), ఆస్మా (20), ప్రవీణా (36), వికారాబాద్ ఆస్పత్రిలో స్వప్న (21), లక్ష్మణ్ (30), సోమయ్య (51), తసూర (6), ఆస్మా సయ్యద్ (31), షఫీ (33) ఉన్నారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనపై విచారణ జరుగుతున్న సైబరాబాద్ సీపీ తెలిపారు. బస్సు కండక్టర్ రాధా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు- టిప్పర్ ప్రమాదంపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ ఆకాశ్‌పై బీఎన్‌ఎస్ 106(1) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు: చేవెళ్ల ప్రమాదంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. వికారాబాద్ జిల్లా యాలాల మం. హాజీపూర్‌కు చెందిన దంపతులు బండప్ప, లక్ష్మి మృతి చెందారు. తల్లిదండ్రుల మృతితో భవాని, శివలీల అనాథలుగా మారారు.ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి : తెలంగాణలోని చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు.

**అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం** : రోడ్డు ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. తక్షణం ఘటనా స్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను సీఎం సూచించారు. ప్రమాద వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎస్, డీజీపీకి రేవంత్ రెడ్డి ఆదేశించారు. క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అందుబాటులో ఉన్న మంత్రులు ఘటనా స్థలికి వెళ్లి పర్యవేక్షించాలన్నారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి పొన్నం** : రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టిప్పర్ రాంగ్‌రూట్‌లో వచ్చి బస్సును ఢీ కొట్టడంతోనే ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారని తెలిపారు.

# 'మీ బోధనా శైలి అద్భుతం'

**మొదటిపేజీ తరువాయి** – లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

**ల్యాబ్‌ను అద్భుతంగా మార్చిన టీచర్**

పాతపట్నం మోడల్ స్కూల్‌లో బోటనీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అప్పలరాజు, తోటి సిబ్బంది సహకారంతో పాఠశాలలోని బయాలజీ ల్యాబ్‌ను కళాత్మకంగా, విజ్ఞానదాయకంగా తీర్చిదిద్దారు. కేవలం ప్రయోగ పరికరాలకే పరిమితం చేయకుండా, మానవ అవయవాలు, మొక్కల భాగాలు, నైతిక విలువలు, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన చేతిరాత పోస్టర్లు, రంగురంగుల చిత్రాలతో ల్యాబ్‌కు కొత్త రూపునిచ్చారు. విద్యార్థులు మైక్రోస్కోప్‌లతో ప్రయోగాలు చేస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో ఆకట్టుకున్నాయి. పరిమిత వనరులున్న గ్రామీణ ప్రాంతాల్లో విద్యను ఎలా ఆసక్తికరంగా మార్చవచ్చో అప్పలరాజు ఆచరణలో చూపిస్తున్నారు.

**టీచర్‌ను అభినందిస్తూ లోకేశ్ ట్వీట్**

ఈ స్ఫూర్తిదాయకమైన ప్రయత్నాన్ని చూసి ముగ్ధులైన నారా లోకేశ్, అప్పలరాజు మాస్టారిని అభినందిస్తూ ట్వీట్ చేశారు. "బల్లెడ అప్పలరాజు మాస్టారు, మీ కళాత్మక బోధనా శైలి చూడ ముచ్చటగా ఉంది. ఏపీ మోడల్ స్కూల్ పాతపట్నంలో బోటనీ సబ్జెక్టు బోధిస్తూనే.. సహ ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో ల్యాబ్‌ను ఆకర్షణీయంగా, విజ్ఞానవంతంగా తీర్చిదిద్దిన తీరు స్ఫూర్తినిస్తోంది. సైన్స్, మోరల్ వేల్యూస్, జనరల్ నాలెడ్జ్ ప్రతిబింబించేలా ల్యాబ్‌ను ఆర్టిస్టిక్‌గా రూపొందించి, నిర్వహిస్తున్న తీరు అభినందనీయం" అని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, అప్పలరాజు వంటి ఉపాధ్యాయుల కృషి పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య విద్యా అంతరాలను తగ్గించడానికి దోహదపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# ఆలయాల్లో భద్రతపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి

**మొదటిపేజీ తరువాయి** – సోమవారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ క్షేత్రం, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయాలకు కార్తీక మాసంలో భక్తులు భారీ సంఖ్యలో వస్తారని, ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "కాశీబుగ్గ ఘటనను దృష్టిలో ఉంచుకొని దేవాదాయ శాఖ ఆలయాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రాలతో పాటు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాల జాబితాను కూడా సిద్ధం చేసి, వాటి వద్ద రద్దీని పర్యవేక్షించాలి" అని అధికారులను ఆదేశించారు. ఈ నెల 5వ తేదీన కార్తీక పౌర్ణమి ఉన్నందున ఆ రోజు, ఆ తర్వాత రోజుల్లో రద్దీ అనూహ్యంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా శని, ఆది, సోమవారాల్లో భక్తుల సంఖ్య భారీగా ఉంటుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. "భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలి. ఆలయ పరిసరాలు, క్యూ లైన్ల వద్ద సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలి. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పారిశుధ్యాన్ని కాపాడాలి. రద్దీకి తగినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలి. ఆలయాల సమీ పంలోని జాతీయ రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రమా దాలు జరగ కుండా చూడాలి. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో వైద్య శిబిరా లను కూడా ఏర్పాటు చేయాలి" అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# నైజీరియాపై సైనిక చర్యకు ట్రంప్ సంకేతాలు



**మొదటిపేజీ తరువాయి** – నైజీరియాలో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల విషయంలో అమెరికా తీవ్రంగా స్పందించింది. ఆ దేశంలో ఉగ్రవాదులను ఏరివేసేందుకు అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వైమానిక దాడులు లేదా నేరుగా అమెరికా బలగాలను పంపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన కీలక సంకేతాలు ఇచ్చారు.ఆదివారం ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో తిరిగి వస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. నైజీరియాలో రికార్డు స్థాయిలో క్రైస్తవులను చంపుతున్నారని, దీనిని తాము ఎంతమాత్రం అనుమతించబోమని అన్నారు. సైనిక చర్యకు సిద్ధంగా ఉండాలని తన దళాలను ఆదేశించినట్లు వెల్లడించారు. "నా మదిలో చాలా ప్రణాళికలు ఉన్నాయి. వారు నైజీరియాలో క్రైస్తవులను రికార్డు సంఖ్యలో హత్య చేస్తున్నారు. అలా జరగడానికి మేము అంగీకరించం" అని ట్రంప్ స్పష్టం చేశారు.ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన 'ప్రత్యేక ఆందోళన కలిగించే దేశాల' జాబితాలో నైజీరియాను చేర్చినట్లు ట్రంప్ గుర్తుచేశారు. మత స్వేచ్ఛను తీవ్రంగా ఉల్లంఘిస్తున్న దేశాలను ఈ జాబితాలో చేర్చుతారు. నైజీరియాతో పాటు చైనా, రష్యా, పాకిస్థాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు కూడా ఇందులో ఉన్నాయి. నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను రక్షించడంలో విఫలమైతే కఠిన చర్యలు తప్పవని గతంలోనే ఆయన హెచ్చరించారు.అమెరికా హెచ్చరికలపై నైజీరియా కూడా స్పందించింది. ఇస్లామిక్ ఉగ్రవాదులతో పోరాడటానికి అమెరికా సహాయాన్ని స్వాగతిస్తామని, అయితే తమ దేశ ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరింది.నైజీరియాలో క్రైస్తవులు, ముస్లింల మధ్య ఘర్షణలు 1950ల నుంచి కొనసాగుతున్నాయి. ముఖ్యంగా 2009 తర్వాత బోకో హరామ్, ఫులానీ పశువుల కాపరులు వంటి రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు క్రైస్తవ గ్రామాలను, చర్చిలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నాయి. నివేదికల ప్రకారం, ఈ హింసలో ఇప్పటివరకు 45,000 మందికి పైగా క్రైస్తవులు ప్రాణాలు కోల్పోగా, వేలాది చర్చిలు ధ్వంసమయ్యాయి.

# ఏఐతో ఉద్యోగాలకు ముప్పు.. ప్రతి పది మందిలో నలుగురిలో భయం

**మొదటిపేజీ తరువాయి** – తమ ఉద్యోగాలు కోల్పోతామని దేశంలోని దాదాపు 50 శాతం మంది మిలీనియల్స్ భయపడుతున్నట్లు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా' సోమవారం విడుదల చేసిన ఒక నివేదిక వెల్లడించింది. పని ప్రదేశాల్లో ఏఐ ప్రభావం, దానికి భారత ఉద్యోగులు ఎలా అలవాటు పడుతున్నారనే అంశంపై ఈ నివేదిక సమగ్రంగా విశ్లేషిం చింది. ఆందోళనలు ఉన్నప్పటికీ, ఉత్పాదకతను, ఆవిష్కం ణలను పెంచే సాధనంగా ఏఐను ఉపయోగించుకోవడానికి ఉద్యోగు లు సిద్ధంగా ఉన్నారని, వారిలో సానుకూల దృక్పథం పెరుగుతోందని కూడా ఈ నివేదిక పేర్కొంది.ప్రస్తుతం దేశంలోని 54 శాతం ఉద్యోగులు పనిచేస్తున్న సంస్థలు ఏఐను పైలట్ లేదా మధ్యంతర దశలో అమలు చేస్తున్నాయని నివేదిక తెలిపింది. ఇది సాంకేతికత ఆధారిత సమర్థవంతమైన పని వాతావరణం వైపు సాగుతున్న ప్రగతిని సూచిస్తోంది. అయితే, ప్రతి పది మంది ఉద్యోగులలో నలుగురు (40శాతం) తమ ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయగలదని భావిస్తున్నారు. ఈ భయం కేవలం యువతకే పరిమితం కాలేదని, అనుభవంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ఉద్యోగులలోనూ కనిపిస్తోందని నివేదిక స్పష్టం చేసింది.మరో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఏఐ వల్ల ఉద్యోగం పోతుందని భయపడుతున్న వారిలో 40 శాతం మంది తమ ప్రస్తుత కంపెనీని విడిచి వెళ్లాలని ఆలోచిస్తున్నట్లు తేలింది. ఇది హెచ్‌ఆర్ విభాగాలకు, కంపెనీల ఉన్నత యాజమాన్యాలకు ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది.ఈ నివేదికపై 'గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా' సీఈఓ బల్బీర్ సింగ్ మాట్లాడుతూ, "సంస్థలు ఏఐ అమలులో ముందుకు సాగుతున్నప్పుడు, మానవ సామర్థ్యాలను దెబ్బతీయకుండా, వాటిని మరింత మెరుగుపరిచే వ్యూహాలను నాయకులు రచించాలి. సంస్థాగత ప్రతిఘటన, ఉద్యోగుల సంసిద్ధత ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన అడ్డంకులు" అని వివరించారు. ఆసక్తికరంగా ఏఐను ఇంకా ఏమాత్రం అవలంబించని కంపెనీలలో పనిచేస్తున్న 57 శాతం మంది ఉద్యోగులు అభద్రతాభావంతో ఉన్న ట్లు నివేదిక గుర్తించింది. అదే సమయంలో ఏఐ వినియోగంలో ఆధునిక దశలో ఉన్న కంపెనీలలో కేవలం 8 శాతం మంది మాత్రమే అభద్రతతో ఉన్నట్లు తేలింది. సరైన ప్రణాళిక, నాయకత్వ మద్దతు, ఉద్యోగులతో పారదర్శక సంభాషణల ద్వారా ఏఐపై ఉన్న భయాలను తొలగించి, భవిష్యత్తుపై ఉత్సాహాన్ని నింపవచ్చని ఇది స్పష్టం చేస్తోం ది."సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐ కోసం వాస్తవ వినియోగాలను గుర్తించి, ఉద్యోగులను భాగస్వా ములను చేయా లి. వారి నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలపై పెట్టు బడి పెట్టాలి. అప్పుడే ఈ మార్పును తట్టుకుని నిలబడగలరు" అని బల్బీర్ సింగ్ సూచించారు.

# రోడ్డుపై టిప్పర్ బీభత్సం- 12 వాహనాలను ఢీకొట్టిన డంపర్- 13మంది దుర్మరణం

**మొదటిపేజీ తరువాయి** – రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హర్మారా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని లోహామండీ రహదారిపై వేగంగా వస్తున్న టిప్పర్ బీభత్సం సృష్టించింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 12 వాహనాలు ఢీకొట్టింది. తొలుత ఒక కారును బలంగా ఢీకొట్టింది. ఆ తర్వాత మరో 11 వాహనాలను బలంగా తాకింది. దీన్ని బట్టి ఆ టిప్పర్ ఎంత వేగంగా వస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రమాదంలో 13 మంది మరణించారు. పలువురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే చౌమున్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారిణి ఉషా శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ ఘటనపై రాజస్థాన్ డిప్యూటీ సీఎం స్పందించారు. ప్రమాదంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.జైపుర్‌లోని హర్మదా రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం జరిగడం చాలా బాధాకరం. జిల్లా యంత్రాంగంతో నేను ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నాను. గాయపడిన వారికి నాణ్యమైన వైద్య చికిత్స అందించడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించాను. అలాగే మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని నేను దేవుడు కోరుకుంటున్నాను.

గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమం!

కాగా, ఈ ప్రమాదానికి సంబంధించి జైపూర్ అదనపు కమిషనర్ రాజీవ్ పచార్ స్పందించారు. 'సమాచారం అందుకున్న హర్మదా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు స్థానికులు సహాయంతో వాహనాలలో చిక్కుకున్న వారికి బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు' అని తెలిపారు. అయితే ప్రమాదంలో గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు.అధికవేగంతో వచ్చిన టిప్పర్ ముందుగా కారును ఢీకొట్టిందని, అనంతరం మరో మూడువాహనాలను ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే ప్రమాదానికి సమీపంలో పార్కింగ్ చేసిన బైక్‌లు ఉన్నాయని, టిప్పర్ వాటిపై బోల్తా పడడంతో దాని కింద నలిగిపోయాయని చెప్పారు. దీంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడిందన్నారు. అయితే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వాహనాలను దారి మళ్లించారని పేర్కొన్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకోవడానికి పోలీసులు ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.'ట్రక్కు లోహామండీ వైపు నుంచి చాలా వేగంగా వస్తోంది. డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడు. దారిలో ఉన్న ప్రతి ఒక్కరినీ తొక్కించాడు. నా కారును పక్కన పార్క్ చేసి ఉంచాను' అని ప్రత్యక్ష సాక్షి తెలిపారు.

డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే!

అయితే డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం డ్రైవర్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. బోల్తాపడిన టిప్పర్‌ను క్రేన్ సహాయంతో తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ ప్రమాదంతో స్థానికులు ఆగ్రహావేశానికి లోనయ్యారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో భారీ వాహనాలను నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 04-11 - 2025

# రహ్మత్ నగర్‌లో డివిజన్లో ఇంటింటి ప్రచారంలో.శ్రీ యస్. రాజేందర్ రెడ్డీ

**– సీరియల్ నంబర్ 3 కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపు**



**తెలంగాణ సేన న్యూస్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలలో భాగంగా రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్ 103లో గౌరవనీయులైన మాజీ శాసనసభ్యులు, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యస్. రాజేందర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ు నమూనా బ్యాలెట్‌లో సీరియల్ నంబర్ 3లోని "కారు" గుర్తుకు ఓటు వేసి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ని ఘన విజయం సాధింపజేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ప్రసాద్, ఎర్రోళ్ల నవీన్, కార్యకర్తలు, మహిళా విభాగం సభ్యులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రహ్మత్‌నగర్ ప్రాంతంలో ఉత్సాహంగా సాగిన ఈ ప్రచారం సందర్భంగా ప్రజల్లో ఎన్నికల జోష్ కనిపించింది.


## చేవెళ్ల మండలం మీర్జాగూడ బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన: బీ,ఆర్,ఎస్ పార్టీ అభ్యర్థి,మాగంటి సునీత గోపినాథ్



**తెలంగాణ సేన న్యూస్ :** నేడు ఉదయం చేవెళ్ల-మీర్జాగూడ రోడ్డుపై జరిగిన బస్సు ప్రమాదంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన గుండమ్మ, కల్పన అనే ఇద్దరు మహిళలు దుర్మరణం పొందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో బాధితుల నివాసాలకు వెళ్లి మృతదేహాలకు పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత గోపీనాథ్ గారు, "పార్టీ తరఫున ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాం" అని భరోసా కల్పించారు. ఆమెతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లైసెన్స్డ్ సర్వేయర్లకు కనీస వేతనం ఇవ్వాలని కలెక్టర్‌కి వినతిపత్రం





**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3 (తెలంగాణ సేన) :** భూభారతి చట్టం కింద అమలవుతున్న లైసెన్స్ సర్వేయర్ వ్యవస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించినా, వేతనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని లైసెన్స్ సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా లైసెన్స్ సర్వేయర్లు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ప్రభుత్వం ఇచ్చిన రెండు సంవత్సరాల లైసెన్స్‌తో భూసర్వే పనులు చేస్తున్నాం. అయితే ప్రభుత్వం నిర్ణయించిన కమిషన్ రేట్లు ు 0 నుంచి 2 ఎకరాలకు రూ.1000, 2 నుంచి 5 ఎకరాలకు రూ.2000, 5 నుంచి 10 ఎకరాలకు రూ.5000, 10 ఎకరాలకు పైగా ప్రతి ఎకరానికి రూ.500 ు ప్రస్తుత ఖర్చులకు సరిపోవడం లేదు" అని పేర్కొన్నారు.ఇంధన ధరలు, రోజువారీ ఖర్చులు, పరికరాల నిర్వహణ, కుటుంబ అవసరాలు పెరగడంతో వేతనం లేకుండా పని చేయడం కష్టంగా మారిందని వారు తెలిపారు. ఐదు నెలల శిక్షణ కాలంలోనూ ఆదాయం లేక అప్పులు చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. అందువల్ల లైసెన్స్ సర్వేయర్లకు ప్రతినెల కనీస వేతనం లేదా బేసిక్ జీతం మంజూరు చేయాలని, లేదా ఔట్‌సోర్సింగ్ / కాంట్రాక్ట్ విధానంలో కనీస వేతనంతో నియామకం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా లైసెన్స్డ్ సర్వేయర్స్ పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ పోటీలో జమ్మికుంట విద్యార్థికి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం.

హెచ్.ఎం. అండ్ పాఠశాల సిబ్బంది ప్రశంసల వెల్లువ.





**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి నవంబర్ 03:** ఇటీవల ఎస్.జి.ఎఫ్. క్రీడలు మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ లో నిర్వహించిన క్రీడా పోటీలలో జమ్మికుంట (బాలురు) ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థి కె.సాయి శ్రీనిత్ తొమ్మిదవ తరగతి విద్యార్థికి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో రెండవ స్థానం లో బహుమతి అందుకోవడం జరిగింది,ఈ సందర్భంగా జమ్మికుంట (బాలురు) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు మాట్లాడుతూ జమ్మికుంట ప్రభుత్వ (బాలురు) ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఆటలకు నిలయంగా మారాయి, పాఠశాలలో క్రీడా నైపుణ్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తాయని పేర్కొన్నారు.కృత్యాలు,ప్రయోగాలు, అన్వేషణల ద్వారా నేర్చుకోవడమే విద్య,క్రీడా విద్య ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసే దిశగా పిడి (ఫిజికల్ డైరెక్టర్) మేడం ఎం.ప్రేమలత కృషి చేశారు.స్పోర్ట్స్ కోటాలో కూడా విద్యార్థినీ,విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు అని ఈసందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు సిబ్బంది వి.సంతోష్ కుమార్, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్, సమ్మయ్య, ప్రభాకర్, యం.శ్రీనివాస్ యేసుమని, వనజ, జ్యోతి, లక్ష్మి, ఎం.స్వామి, కె. సంపత్,డి.వరదరాజు, రాం. రాజయ్య తదితరులు విద్యార్థి (సాయి శ్రీనిథ్)కి ప్రశంసలు (అభినందనలు) తెలిపారు.

## మల్కపేట రిజర్వాయర్‌లో ఉచిత చేప పిల్లల విడుదల



**కోనరావుపేట, నవంబర్ 3 (తెలంగాణ సేన) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గారితో కలిసి చేప పిల్లలను విడుదల చేశారు.

## ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ బ్లాక్ కావడంతో అవస్థలు



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ బ్లాక్ కావడంతో ప్రజ్ఞాపూర్ నుండి జగదేవపూర్ రోడ్డు వెళ్లే మెయిన్ రోడ్డులో అలాగే సెయింట్ మేరీ విద్యానికేతన్ హై స్కూల్ పరిసరాల్లో మురుగునీరు ప్రవహిస్తూ ఇటు ప్రజలకు మరియు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నది ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరమ్మతు చేయాలని, అందులోనికి వెళ్ళవలసిన మురుగునీరు సెయింట్ మేరీస్ హై స్కూల్ నుండి గృహ సముదాయల మధ్య నుండి ప్రవహిస్తూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ఇటు ప్రజలకు మరియు పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని, వర్షాకాలం మరింత ఇబ్బందిగా మారిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు

# దేశభక్తులు ఎవరో, దేశద్రోహులు ఎవరో చర్చ జరగాలి

**– రాజ్యాంగాన్ని ధిక్కరించే వాళ్లు దేశద్రోహులు!**
**–జజీ×పై దాడికి నిరసనగా నవంబర్ 17న 'ఛలో ఢిల్లీ'**
**– మంద కృష్ణ మాదిగ పిలుపు..**



**తెలంగాణసేనన్యూస్, హైదరాబాద్:** సోమాజిగూడ ప్రెస్ క్లబ్ /సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ BR గవాయి పై జరిగిన అమానుష దాడి నేపథ్యంలో, దేశభక్తులు ఎవరో, దేశద్రోహులు ఎవరో దేశవ్యాప్తంగా చర్చ జరగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు.హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ు"రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నతమైన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దళితుడైన గవాయ్ గారిపై నెలరోజులు క్రితమే జరిగిన దాడిపై ఇప్పటికీ చట్టపరమైన చర్యలు లేకపోవడం దేశానికి అవమానం" అని తీవ్రంగా విమర్శించారు.

నిందితుడు బూటుతో దాడి చేసినా వ్యవస్థలు మౌనంగా ఉన్నాయని, రేపు కత్తితో దాడి చేసినా ఇదే పరిస్థితి ఉంటుందా అని ప్రశ్నించారు. డిల్లీ పోలీసులు, న్యాయవ్యవస్థ, మానవహక్కుల కమిషన్ ఈ దాడిని సుమోటోగా ఎందుకు స్వీకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు."ధర్మం ముసుగులో దాడులు చేస్తే చట్టం ఏమి చేయదు? కేసులు పెట్టరా? అరెస్టులు ఉండవా? శిక్షలు వేయరా?" అంటూ మండిపడ్డారు. గవాయి గారిపై దాడి దళితులపైనే కాదు, రాజ్యాంగంపైన కూడా దాడి అని తెలిపారు.రాజ్యాంగం ఏర్పడిన తర్వాతనే దళితులు మనుషులుగా గుర్తింపు పొందారని,రాజ్యాంగం వల్లనే ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు.కానీ దళితులంటే గిట్టని శక్తులే రాజ్యాంగాన్ని ధిక్కరించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు."ధర్మం పేరుతో దాడులు చేస్తే, రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తామంటే. దళిత సమాజం నిశ్శబ్దంగా ఉండదు.రాజ్యాంగాన్ని ధిక్కరించే వారు, చట్టాన్ని అవమానించే వారు దేశద్రోహులుగా మిగిలిపోతారు." అని మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రపంచం గౌరవిస్తుంటే, అదే రాజ్యాంగాన్ని అవమానించే కొందరు దేశంలో మూరు?లుగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

న్యాయవ్యవస్థలో కూడా దళితులపై వివక్ష కొనసాగుతోందని పేర్కొన్నారు.హైకోర్టు జస్టిస్ కర్ణన్‌పై విధించిన శిక్ష దీనికి ఉదాహరణగా నిలుస్తుందని గుర్తు చేశారు.దళితులపై జరుగుతున్న వివక్షకు ఎదురు నిలవాల్సిన సమయం వచ్చిందని అన్నారు."నవంబర్ 17న ఢిల్లీలో భారీగా 'ఛలో ఢిల్లీ ు దళితుల ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహిస్తాం," అని ప్రకటించారు. దళితుల ఆత్మగౌరవం, న్యాయవ్యవస్థ గౌరవం, రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా దళిత, అణగారిన వర్గాలు మరియు ప్రజాస్వామికవాదులు ఢిల్లీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన దళితుల ఆత్మగౌరవ ర్యాలీ పెద్ద ఎత్తున విజయవంతమైనప్పటికీ, కొన్ని మీడియా సంస్థలు ఆ వార్తలను నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు."దళితుల గొంతు వినిపించకుండా అణచివేయడం సరైంది కాదు ు దళిత సమాజం దీనిని గమనిస్తోంది" అని మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్పి జాతీయ నాయకుడు సొట్ట నరేంద్రబాబు మాదిగ, ఎం ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు ఇంజం వెంకటస్వామి మాదిగ, ఎంఎస్పి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ, ఎంఎస్పి హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఇటిక శ్రీ కిషన్ మాదిగ ప్రధాన కార్యదర్శి దప్పు మల్లికార్జున మాదిగ, రేణుక మాదిగ,సుజాత మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజల న్యాయానికి చట్టబద్ధ పరిష్కారం

**– గ్రీవెన్స్ డేలో ఎస్పీ ఆదేశాలు"**



**నిర్మల్:నవంబర్ 03:తెలంగాణ సేన న్యూ స్.:** సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# బీసీ జేఏసీ కి మద్దతు తెలిపిన వడ్డెర కుల సంఘం

**బీసీ జెఏసి చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్**



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నర్సంపేట వడ్డెర కుల సంఘం నాయకులు బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ మరియు బిసి జెఏసి చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ను కలిసి బీసీ రిజర్వేషన్ల పోరాటంలో బీసీ జెఏసి కి మా మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ జెఏసి ఆధ్వర్యంలో బిసి లకు 42శాతం రిజర్వేషన్లను సాదించడానికి చేస్తున్న పోరాటంలో మేము సైతం అంటూ వడ్డెర కులస్థులు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీసీ జెఏసి ఆధ్వర్యంలో బిసి రిజర్వేషన్ల కోసం చేస్తున్న పోరాటంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎలాగైతే తెలంగాణ జెఏసి ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర సాధనే ఎజెండా అని ఎలాగైతే పోరాడి సాధించుకున్నామో బీసీ లకు విద్య, ఉద్యోగం, రాజకీయ రిజర్వేషన్లను సాధించుకునే పోరాటంలో కూడా అన్ని కులాలకు చెందిన వారు కలసి వచ్చి బిసి జెఏసి చేస్తున్న పోరాటంలో బీసీ లు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని డ్యాగల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, బిసి జెఏసి కో ఆర్డినేటర్, వడ్డెర సంఘం నాయకులు ఓర్సు సాంబయ్య, వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఓర్సు రాజేందర్, నర్సంపేట పట్టణ కార్యదర్శి శీరంశెట్టి రాజేందర్ పెరక వడ్డెర కుల సంఘం సభ్యులు ఓర్సు కుమార్, గుర్రం నరేష్, ఓర్సు చిన్న కుమార్, ఓర్సు సతీష్ తదితరులు పాల్గొన్నారు.


# కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి పోటెత్తిన భక్తులు





**తెలంగాణ సేన నవంబర్ 04 ( బాసర ప్రతినిధి ) :** నిర్మల్ జిల్లా బాసర :- దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో కార్తిక సందడి నెలకొంది. సోమవారం కావడంతో భక్తులు వివిధ రాష్ట్రాల నుండి తెలంగాణ, మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాల నుండి రైలు, బస్సు మార్గం ద్వారా తరలి వచ్చారు. కార్తీక మాస శుభసందర్భంగా ముందుగా గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నది ఒడ్డున గల సురేశ్వర ఆలయంలో భక్తులు దర్శించుకుని అనంతరం అమ్మవారిని దర్శించు కున్నారు. ప్రత్యేక క్యూ లైన్ లో నిలబడి అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ముందుగా కార్తిక దీపాలు వెలిగించారు. అమ్మవారి ము గర్భగుడిలో ప్రత్యేక కుంకుమార్చన పూజలతో పాటు తమ చిన్నారులకు ఎ. అక్షర శ్రీకార పూజలు చేశారు. కార్తీక మాసంలో ప్రతి ఆలయంలో ముఖ్యంగా దర్శించుకుంటారు. అదేవిధంగా మహాలక్ష్మి, సరస్వతి ని అమ్మవార్లకు దర్శించు కోవడానికి. శివునికి సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేపట్టి కార్తిక దీపాలను వెలిగించడంతో ఆలయంలో ఒకేసారి భక్తుల రద్దీ నెలకొంది. ఈ కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం వలన కుటుంబ సభ్యులతో పాటు పెళ్లి కానీ వారి కోసం ము కార్తీకమాసం శుభదాయకమని అన్నారు. ఈ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టి ప్రతి రోజు ఉదయం సాయంత్రం దీపాన్ని వెలిగించారు. దీనితో గోదావరి నదితోపాటు బాసర ని- ఆలయంలో ఎటుచూసినా భక్తుల రద్దీతో కిటకిట ని లాడింది. భక్తులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు. ఈవో అంజనీదేవి . పోలీస్ సిబ్బంది ఎస్సై గణేష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు

# దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయ పరికరములు ఉచిత పంపిణీ..



**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3 (తెలంగాణ సేన) :** దివ్యాంగులకు ఉపకరణాలు మరియు సహాయ పరికరములు ఉచిత పంపిణీ చేయుటకు అర్హులైన వారి ఎంపిక కొరకు క్యాంపులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇ.రేవంత్ రెడ్డి,కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వేములవాడ శాసనసభ్యులు విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ శ్రీమతి గరిమ అగ్రవాల్ ఆదేశాలతో అలింకో సంస్థ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు మరియు వయోవృద్ధులు ఉపకరణాలు మరియు సహాయక పరికరాలు గుర్తింపు కోసము జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం,మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోయినపల్లి మండలంలో క్యాంపు నిర్వహించడం జరిగింది.దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ రంగ అలింకో సంస్థ సిబ్బంది బ్యాటరీ ఆపరేటర్ సైకిల్స్,వీల్ చైర్స్, దృష్టిలోపము అంధత్వము ఉన్నవారికి స్మార్ట్ ఫోన్లు,బదిరులకు వినికిడి యంత్రాలు, అలాగే వయవృద్ధుల కోసం వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్కులు మోకాలు పట్టీలు నడుము పట్టీలు చేతి కర్రలు మొదలైన వాటిలో ఎంపికలు జరిగాయి.ఈ క్యాంపు నందు దాదాపు 400 మంది హాజరై వారి పేర్లను నమోదు చేసుకుని అర్హత గల పరికరా కోసం దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ పి లక్ష్మీరాజం, ఎంపీడీఓ జయశీలా, సీడీపీఓ సౌందర్య,ఏసీడీపీఓ సుచరిత,రోజా,డి హబ్ కో ఆర్డినేటర్, ఇంచార్జ్ డిసిపిఓ అంజయ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ స్రవంతి మరియు అలింకో సిబ్బంది ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు నిర్మల, శంకరమ్మ, అంగన్వాడీ టీచర్లు ఐసిపిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడలో కార్తీక సోమవారం భక్తుల రద్దీ





**వేములవాడ, నవంబర్ 3 (తెలంగాణ సేన)** : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద రెండవ కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. కార్తీక మాస ప్రతీ సోమవారం స్వామివారికి మరియు అనుబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చనలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ప్రీతిమైనా కోడెమొక్కులు, అభిషేకాలు, అన్నపూజలు, నిత్య కళ్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, లింగార్చనలు వంటి వివిధ సేవలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# గుంతల మయం లో రహదారులు

## గత వారం రోజులుగా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని నిలిపివేసిన అధికారులు



**కొత్తగూడ తెలంగాణ సేన :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గంగారం ఉమ్మడి మండలాలలోని 110 గ్రామాలకు గత వారం రోజులుగా ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు అక్టోబర్ 29 నుండి మొంథా ప్రభావంతో వాగులు వంకలు పొంగిపోర్లాయి. దీంతో రెండు మండలాల ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టులు దెబ్బ తినడంతో బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. దీంతో ఈ గ్రామాల ప్రజలు అత్యవసర పనుల మీద వెళ్లాలన్నా ఇతరు ఏ పనుల మీద వెళ్లాలని... ప్రైవేట్ వాహనాల ఆశ్రయిస్తే దీన్ని అలుసుగా చూసుకొని ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంతవరకు ఆర్ అండ్ బి అధికారులు కానీ సంబంధిత ఇతర అధికారులు కానీ వచ్చింది లేదు... చూసింది లేదు... వారి అలసత్వంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు గత వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు దెబ్బతిన్న కల్వర్టును మరమ్మతులు చేసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజల డిమాండ్ చేస్తున్నారు

# మంత్రి సీతక్కకు ప్రతిష్ఠాత్మక వివిజిఎఫ్ సదస్సుకు ఆహ్వానం



**ములుగు జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన :** పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు అంతర్జాతీయ స్థాయి మహిళా నాయకత్వ వేదిక 'వైటల్ వాయిసెస్ గ్లోబల్ ఫెలోషిప్ సదస్సుకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా మహిళా నాయకత్వం, సామాజిక మార్పు, ప్రజా సేవా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న నాయకులను ఈ సదస్సుకు ఆహ్వానిస్తారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం సీతక్క చేసిన కృషిని గుర్తిస్తూ నిర్వాహకులు ఈ గౌరవాన్ని అందించారు. ఈ నేపద్యంలో మంత్రి సీతక్క నెదర్లాండ్స్ కి ఆదివారం నాడు చేరుకున్నారు. నెదర్లాండ్స్ లో జరుగుతున్న ఈ సదస్సులో ప్రపంచంలోని పలు దేశాల మహిళా నాయకులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నెదర్లాండ్స్ కి చేరుకున్న సీతక్క తెలంగాణలో అమలవుతున్న మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలను, గ్రామీణ అభివృద్ధి చర్యలను అంతర్జాతీయ వేదికపై వివరించనున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

## ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో నిరవధిక బంద్

**తెలంగాణ సేన న్యూస్: నవంబర్ 03:** రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నేటి నుండి నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. సోమవారం రోజు నిర్మల్ జిల్లాలోని 23 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వం రెండు సంవత్సరాలు, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల నుండి అనగా మొత్తం నాలుగు సంవత్సరాల నుండి డిగ్రీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రతి ప్రైవేటు డిగ్రీ కళాశాలకు రెండు నుండి మూడు కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని వారు తెలిపారు. విద్యార్థుల నుండి ఎలాంటి ఫీజు వసూలు చేయకుండా కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులతోనే కాలేజీలను నడిపిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిధులు లేకుండా కళాశాలలను నడపడం సాధ్యం కావడం లేదని, అందుకోసం ప్రభుత్వం స్పందించి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కనీసం విడతల వారీగానైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కళాశాల యాజమాన్యాలు కోరాయి.

# రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని చౌరస్తాకు తరలించాలి



**ముధోల్:నవంబర్ 03:తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్:మండల కేంద్రమైన ముధోల్లోని బైంసా- బాసర జాతీయ రహదారి విస్తరణ సమయంలో ప్రస్తుతం ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సెంట్రల్ డివైడర్ ఎక్స్ రోడ్డుకు తరలించాలని విగ్రహ కమిటీ, అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీ సభ్యులు, మాట్లాడుతూ ముధోల్ జాతీయ రహదారి చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ముధోల్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు ప్రతి సంవత్సరం దసరా పండుగ రోజున ధమ్మ చక్ర పరివర్తన దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అదేవిధంగా రాజ్యాంగ నిర్మాత పుట్టినరోజును సైతం అక్కడే జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. గత 50 సంవత్సరాల నుండి విగ్రహం అక్కడే ఉంది కాబట్టి విగ్రహాన్ని సెంట్రల్ డివైడర్ ఎక్స్ రోడ్ కు తరలించాలని కోరారు.

# పావురాల బిక్షపతి పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు



**ములుగు జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన :** మండలంలోని కన్నాయిగూడెం గ్రామానికి చెందిన పావురాల బిక్షపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ములుగు రోడ్డు లోని లలిత హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తాడ్వాయి మాజీ జెడ్పిటిసి రామ సహాయం శ్రీనివాసరెడ్డి, రజిత తెలిపారు . తన భార్య పావురాల సుమలత రోడ్డు ప్రమాదంలో చనిపోవడం దురదృష్టకరమని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తున్నానని తెలిపారు

# మద్దతు ధర కోసం నాణ్యమైన పత్తి తీసుకురావాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**బైంసా:నవంబర్ 03:తెలంగాణ సేన న్యూస్. :** రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్ యార్డులకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించాయి. సోమవారం బైంసా వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కార్యక్రమాన్ని కలెక్టర్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, రైతులు, అధికారులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా క్వింటాలుకు రూ.8,110 కనీస మద్దతు ధరను నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. రైతులు 'కపాస్ కిసాన్ యాప్' ద్వారా స్లాట్ బుకింగ్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మార్కెట్ యార్డుల్లో తాగునీరు, విశ్రాంతి గదులు, తూకం యంత్రాలు, కంట్రోల్ రూమ్ వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో 1,41,455 ఎకరాల్లో పత్తి సాగు, 11,08,646 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేశామని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులంతా తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మాత్రమే అమ్మాలని సూచించారు. పంటను బాగా ఆరబెట్టుకొని తెస్తే ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. తేమశాతం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, అధికారులు సహకరిస్తారని భరోసా ఇచ్చారు. జిల్లాలో 17 జిన్నింగ్ మిల్స్, 17 కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని వివరించారు. అనంతరం ముధోల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాల కారణంగా పత్తిలో తేమశాతం పెరిగిందని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. తేమశాతం విషయంలో అధికారులు సడలింపు ఇవ్వాలని ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. రైతులు పత్తిని వీలైనంతగా ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. పత్తి రైతులందరికీ మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మార్కెట్ యార్డులో కలెక్టర్, శాసన సభ్యులు సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను కూడా పరిశీలించారు. ప్రతి గింజ సోయా పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. దశలవారీగా టోకెన్లు జారీ చేసి పంటలన్నింటినీ కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజ్మీర్ సంకేత్ కుమార్, ఏడి మార్కెటింగ్ గజానన్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, వైస్ చైర్మన్ ఫారూక్ అహ్మద్ సిద్ధిఖీ, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో నీరజ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అవార్డు పొందిన ప్రభును సన్మానించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి నవంబర్ 03:** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ (ప్రభు) జమ్మికుంట పట్టణ కేంద్రంలో గత రెండు దశాబ్దాల కాలంగా ఆర్టిస్ట్ గా ఉంటూ తనకు వచ్చిన డబ్బులో నుండి సమాజ సేవ చేస్తూ సామాజిక కార్యకర్తగా అనేక సేవా కార్యక్రమాలను గుర్తించిన ఏషియా ఇంటర్నేషనల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని హొసూర్ నగరంలో అంబాల ప్రభాకర్ (ప్రభు ) సామాజిక సేవ రంగంలో గౌరవ డాక్టర్ రేట్ అవార్డులను అందుకున్న సందర్భంగా తన స్వగృహం నందు అంతర్జాతీయ క్రీడాకారులు, ప్రభుత్వ ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు రఘు మాట్లాడుతూ..కుల,మత పేద,ధనిక తేడా లేకుండా ప్రజలందరితో మమేకంగా ఉంటూ సామాజిక సేవారంగంలో గత 20 సంవత్సరాలుగా అనేక కుటుంబాలకు వివిధ రకాల సేవా కార్యక్రమాలలో పాల్గొని వందలాది నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలను విద్యా, వైద్య, సేవా పరంగా ఆదుకున్నారన్నారు,క్రీడా రంగంలో తన అందరికి ఆదర్శం అని అన్నారు. ఈ సామాజిక సేవ చేయడం వలన ఏషియా ఇంటర్నేషనల్ రీసర్చ్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం ఆయనకే కాకుండా మాలాంటి క్రీడాకారులకు గర్వకారణమని అన్నారు. అదేవిధంగా గౌరవ డాక్టరేట్ పొందడం అంటే సమాజానికి మరింత సేవ చేసే బాధ్యతను పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కలాలా ముత్యం రెడ్డి బిజిగిరి హరికృష్ణ శనిగరం రాజు తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల పోరాటయోధుడు కామ్రేడ్ వల్లపు యాదగిరి

## తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

## పేద ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన హక్కుల పోరాట యోధుడు కామ్రేడ్ వల్లపు యాదగిరి – తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్





**మహబూబాబాద్ జిల్లా తెలంగాణ సేన నవంబర్ 3 :** సోమవారం మహబూబాబాద్ లోని ఎన్జీవో కాలనీలో ప్రజా సంఘాలు బంధుమిత్రుల ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనుముల ప్రేమ్ చంద్ అధ్యక్షతన ప్రముఖ న్యాయవాది హక్కులనేత కామ్రేడ్ వల్లపు యాదగిరి సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ప్రొఫెసర్ లక్ష్మణ్ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల కోసమే జీవించి ప్రజల కోసమే తన జీవితమంటూ తన మరణం వరకు పోరాడిన మట్టి మనిషి, అనేక ప్రజా పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజా చైతన్యాన్నికలిగించిన పౌర హక్కుల నేత, ప్రముఖ న్యాయవాది వల్లపు యాదగిరి జీవితం నేటి తరానికి ఆదర్శం అని ఆయన అన్నారు. వల్లపు యాదగిరి తను నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం నిలబడి కొట్లాడిన మానుకోట మట్టి బిడ్డని ఆయన కీర్తించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యక్తులకు సహజ సంపదలను దోచి పెట్టేందుకే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలపై అణిచివేతకు పాల్పడుతుందని ఆయన అన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను సహజ వనరులను కార్పొరేట్ వ్యక్తులకు దోచిపెట్టేందుకే ఆదివాసులపై, ఆదివాసులకు అండగా నిలిచిన మావోయిస్టులపై హత్యాకాండను కొనసాగిస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధ పాలనను కొనసాగించకుండా హింసను ప్రేరేపిస్తుందని అన్నారు.ప్రజా ఉద్యమకారుడుగా , విప్లవ విద్యార్థి ఉద్యమ నేతగా, న్యాయవాదిగా, అనేక పోరాటాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచిన వల్లపు యాదగిరి జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని, వల్లపు యాదగిరి ఆశయాలను, ఆలోచన విధానాన్ని మనం కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళులు గడ్డం లక్ష్మణ్ అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు విశ్వ జంపాల, చిత్తారి సోమన్న, పౌర హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, కొంపెల్లి వెంకటయ్య, మామిడాల సత్యనారాయణ, బిక్కి వెంకటేశ్వర్లు, చిర్రా రవి, బాజె సైదులు, దేవిరెడ్డి విజయ్, చక్రధర్ జంపాల, హెచ్ లింగన్న, కొత్తపల్లి రవి, మైస శ్రీనివాస్, గిన్నారపు మురళి తారక రామారావు, అయోధ్య రామయ్య, మార్నేని రఘు, దేగల సత్యనారాయణ, తుంపెల్లి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, సందకృష్ణ, ఆరెల్లి శ్రీనివాస్, దర్శనం రామకృష్ణ, దర్గయ్య మొలకల నరేష్, ఆంగోత్ చందూలాల్, మంద శశి కుమార్, పాణి, మల్లయ్య, మున్నా, వల్లపు యాదగిరి కుటుంబ సభ్యులు అరుణ, ఐలోని, అరుణ్, శ్వేత, లక్ష్మి భార్య సాగరిక, అనిల్, వెంకటలక్ష్మి, భారతమ్మ తదితరులు పాల్గొని వల్లపు యాదగిరికి ఘనంగా నివాళులు అర్పించారు.

# రూ.2 కోట్ల వ్యయంతో నూతన రహదారి నిర్మాణానికి శ్రీకారం

## గ్రామీణ రహదారి అభివృద్ధి ద్వారా ప్రజలకు సౌకర్యాలు పెంపొందిస్తాం:ఎమ్మెల్యే

## రాచాలపల్లి-మాదారం రహదారి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**తెలంగాణ సేన న్యూస్ :** జడ్చర్ల నియోజకవర్గంలోని ఊరుకొండ మండలం లోని రాచాలపల్లి నుండి మాదారం వరకు రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మాణం జరుగుతున్న రహదారి పనులను నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ు గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు సౌకర్యాలు పెంపొందించడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ రహదారి పూర్తయ్యే సరికి రవాణా సౌకర్యం మెరుగై, రైతులు తమ పంట ఉత్పత్తులను సులభంగా మార్కెట్లకు తరలించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధి పనుల పట్ల చూపుతున్న ఆనందం తనకు ప్రేరణగా ఉందని ఎమ్మెల్యే గారు అన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా దృఢంగా ముందుకు సాగేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 30 వేలు ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు...



**చండూరు, తెలంగాణ సేన :** మండలంలోని కస్తాల గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన ఆకారం మల్లయ్య మరియు అతని భార్య అయిన యాదమ్మ లు గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భంలో విషయం తెలుసుకున్న బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న అభ్యర్థన మేరకు స్పందించిన కస్తాల గ్రామ బిఆర్ఎస్ నాయకులు తమ శక్తి కొద్ది సహాయ సహకారాలు అందించి ఆదివారం ఆ బాధిత కుటుంబానికి 30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబానికి చెందిన ఆకారపు యాదమ్మ కు దాతలు ముందుకొచ్చి పెద్ద మనసుతో ఆర్థిక సహాయం అందజేసి వారిని ఆదుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో. బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొమ్మర బోయిన వెంకన్న, సింగిల్ విండో వైస్ చైర్మన్ గుండ మల్ల శ్రీనివాసులు, గ్రామ శాఖ అధ్యక్షులు ధోటి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ బొమ్మర బోయిన వెంకటేశం, మాజీ ఎంపీటీసీ గుండమల్ల వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్ ఊరుగుండ్ల వెంకటేశ్వర్లు, మాజీ వార్డు సభ్యులు అబ్బిడి కోటిరెడ్డి, జాల వెంకన్న, సరిపెల్లి రమేష్, మాజీ వార్డ్ నెంబర్ జాల రామకృష్ణ, ఆకారపు శ్రీకాంత్, గంట కంపు విజయ్, ఆమలూరి రవికుమార్, గాలెంక రాంబాబు, ఆమలూరి అశోక్, గాదెపాక జంగయ్య, గంటెకంపు దేవేందర్, దాసరి శ్రీనాథ్, దాసరి శ్రీను, ఆకారపు వెంకన్న, కట్ట రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల శ్రీనివాస్ గుప్తను కలిసిన ఎన్ సత్యనారాయణ

**తెలంగాణ సేన :** టిపీసీసీ జనరల్ సెక్రెటరీ, ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన యాదగిరి గుట్ట భువనగిరి జిల్లా గౌస్ నగర్ గ్రామానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు ఎన్ సత్యనారాయణ ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్య ముద్దు బిడ్డ వైశ్య సమాజానికి అండగా ఉంటూ అన్ని వర్గాల ప్రజల మేలు కోసం నిత్యం పరితపిస్తూ, నిరుపేద ఆడబిడ్డల పెళ్లిలకు పుస్తె మట్టెలు అందజేస్తూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా భువనగిరిలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని అన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
మంగళవారం 04 - 11 - 2025

# హైస్పీడ్ కారిడార్ లక్ష్యంగా బుల్లెట్ రైళ్లు

**పెరుగుతున్న రైల్వే లైన్లు**

**బుల్లెట్ రైళ్లు దూసుకెళ్లేలా కొత్త రైల్వే లైన్లకు గ్రీన్ సిగ్నల్**

**డిసెంబరు ఆఖరుకు డీపీఆర్‌ల పూర్తి**



కొత్త రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. హైదరాబాద్ నుంచి చెన్నై హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు లక్ష్యంగా ఇప్పటికే పనులు కొనసాగుతున్నాయి. చెన్నై నుంచి రేణిగుంట వరకు ఒకటి రెండు మినహా లెవల్ క్రాసింగ్‌ల వద్ద నిర్మాణాలు పూర్తి చేశారు. త్వరలో బుల్లెట్ రైళ్లు నడిపే ఆలోచన ఉన్న నేపథ్యంలో రైల్వే లైన్ల సంఖ్య పెంచాలని సంబంధిత అధికారులు చూస్తున్నారు.

**ఉమ్మడి చిత్తూరుకు 3 :** ఒకే మార్గంలో సరకు రవాణా, హైస్పీడ్ రైళ్లు వెళ్లే అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త లైన్ల ఏర్పాటుకు అనుగుణంగా డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులకు రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసింది. డిసెంబరు ఆఖరు నాటికి డీపీఆర్‌లు పూర్తి చేయాలని గడువు విధించింది. దీనిలో భాగంగా రాష్ట్రానికి కొత్తగా 26 ప్రాజెక్టులు రాగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మూడు కేటాయించినట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఎక్కువగా వీఐపీల రాక ఈ దారుల్లోనే
మార్గం : చెన్నై- తిరుపతి
ప్రతిపాదనలు : అరక్కోణం- రేణిగుంట
దూరం : 43 కిలోమీటర్లు లైన్లు : 3 లేదా 4

చెన్నై నుంచి తిరుపతికి నిత్యం రైళ్ల రాకపోకలు ఉంటాయి. శ్రీవారి దర్శనానికి పలువురు వీఐపీలు వస్తుంటారు. రేణిగుంట- చెన్నై మార్గంలో అరక్కోణం వరకు సింగిల్ ట్రాక్ మాత్రమే ఉంది. యూనిట్, సరకు రవాణా రైళ్లు ఈ మార్గంలోనే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో లైన్లు పెంచనున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.

**55 కిలోమీటర్ల మేర**
మార్గం : చెన్నై- గూడూరు
ప్రతిపాదనలు : గుమ్మడిపూండి- సూళ్లూరుపేట
దూరం : 18. 40 కిలోమీటర్లు
ప్రతిపాదనలు : సూళ్లూరుపేట- గూడూరు
దూరం : 55 కిలోమీటర్లు లైన్లు : 3 లేదా 4

ప్రాజెక్ట్ కి.మీ. (ఏపీ పరిధిలో)
హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ 300
హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ 464
ఒంగోలు-దొనకొండ కొత్త లైన్ 87.45
దూపాడు-బేతంచెర్ల కొత్త లైన్ 47.61
మచిలీపట్నం-నరసాపురం కొత్త లైన్ 73.99
మచిలీపట్నం-రేపల్లె కొత్త లైన్ 45.30
బాపట్ల-రేపల్లె కొత్త లైన్ 45.81
పాలసముద్రం-నారాయణపురం కొత్త లైన్ 23
కాచిగూడ-చిట్యాల-జగ్గయ్యపేట కొత్త లైన్ 10
కొండపల్లి-సత్తుపల్లి కొత్త లైన్ 4.87
కొత్తగూడెం-కిరండోల్ కొత్త లైన్ 12.31
కొత్తవలస-అనకాపల్లి మధ్య బైపాస్ లైన్ 33
గుంతకల్లు వద్ద బైపాస్, రైల్ ఒవర్ రైల్ (ఆర్వోఆర్)వంతెన 12.20
పేరేచర్ల-మంగళగిరి మధ్య బైపాస్ లైన్, ఆర్వోఆర్ వంతెన 36
కాజీపేట-విజయవాడ మధ్య నాలుగో లైన్ 36
విజయవాడ-గూడూరు మధ్య నాలుగో లైన్ 293
గుంతకల్లు-బళ్లారి మధ్య నాలుగో లైన్ 24.21
వాడి-గుంతకల్లు మధ్య మూడు, నాలుగు లైన్లు 93.82
బంగార్పేట-జోలార్ పెట్టై నాలుగో లైన్ 30
గుమ్మడిపూండి-సూళ్లూరుపేట మధ్య మూడు, నాలుగు లైన్లు 18.40
సూళ్లూరుపేట-గూడూరు మధ్య మూడు, నాలుగు లైన్లు 55
అరక్కోణం-రేణిగుంట మధ్య మూడు, నాలుగు లైన్లు 43
గోపాలపట్నం-దువ్వాడ మధ్య మూడు, నాలుగు లైన్లు 10
సింహాచలం నార్త్-కొత్తవలస మధ్య ఐదు, ఆరు లైన్లు 16
రాయదుర్గం-తుముకూరు రెండో లైన్ 93
మలుగూరు-మడకశిర-హిరియూరు మధ్య రెండో లైన్ 52
మొత్తం 1,960

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఆరింట మూడు డివిజన్లు విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా జోన్‌కు వెళ్తుండటంతో పలు డివిజన్ల సరిహద్దుల్లో మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉంది. రైల్వేబోర్డుకు పంపిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో డివిజన్ల హద్దులు మార్చాలంటూ ప్రతిపాదనలు వెళ్లాయి. అవి ఆమోదం పొందితే కొన్ని డివిజన్ల సరిహద్దులు మారుతాయి.

# రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి, కేంద్రంపై విమర్శలు

**కాల్పుల విరమణ పొడిగించిన మావోలు**


**తెలంగాణలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ**

**ప్రజల ఆకాంక్షల మేరకే ఈ పొడిగింపు అని వెల్లడి**

**గత మే నెలలో ప్రకటించిన విరమణకు ఇది కొనసాగింపు**

**శాంతి వాతావరణానికి కేంద్రం భంగం కలిగిస్తోందని ఆరోపణ**

**రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని లేఖలో విజ్ఞప్తి**



తెలంగాణలో కాల్పుల విరమణను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో సోమవారం ఓ అధికారిక లేఖ విడుదలైంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో స్పష్టం చేశారు.గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కోసం వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు ఉద్యమించాయని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే తాము గత మే నెలలో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటించామని జగన్ గుర్తుచేశారు. ఆ గడువు ముగిసిన నేపథ్యంలో, ప్రజల అభీష్టం మేరకు మరో ఆరు నెలల పాటు ఈ విరమణను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గడిచిన ఆరు నెలల కాలంలో తమ వైపు నుంచి సంపూర్ణంగా శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉన్నామని, భవిష్యత్తులోనూ ఇదే పంథాను అనుసరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో వ్యవహరించిన విధంగానే సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అయితే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం తెలంగాణలో నెలకొన్న శాంతి వాతావరణానికి భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వ దుందుడుకు చర్యలను అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.ఓవైపు మావోయిస్టులు తెలంగాణలో కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. మావోయిస్టులతో ఎలాంటి కాల్పుల విరమణ ఒప్పందం ఉండబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ఓ బహిరంగ సభలో తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మావోయిస్టుల తాజా ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# విశాఖలో విషాదం.. ఏడు నెలల గర్భిణి


**కడుపులోని బిడ్డ సహా దంపతుల బలవన్మరణం**

**విశాఖ అక్కయ్యపాలెంలో ఘటన యువ దంపతుల ఆత్మహత్య**

**ఫ్యాన్‌కు ఉరేసుకున్న భర్త.. మంచంపై విగతజీవిగా భార్య**

**కడుపులోని బిడ్డను కాపాడే ప్రయత్నం విఫలం**

**గర్భంలోని ఆడశిశువు కూడా మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారణ**



విశాఖ నగరంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. అన్యోన్యంగా జీవిస్తున్న యువ దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెంలో ఈ ఘటన వెలుగుచూసింది. మృతుల్లో ఏడు నెలల గర్భిణి ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం, దాలిరాజు సూపర్‌మార్కెట్ సమీపంలో సూరిశెట్టి వాసు తన భార్య అనిత, తల్లితో కలిసి నివసిస్తున్నాడు. ఏడాది క్రితం వీరికి వివాహం జరిగింది. ప్రస్తుతం అనిత ఏడు నెలల గర్భిణి. నిన్న ఉదయం వాసు తల్లి ఒక ఫంక్షన్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి ఇంటి తలుపు తట్టగా ఎంతసేపటికీ తీయలేదు. అనుమానంతో కిటికీలోంచి చూడగా లోపల దృశ్యం చూసి నిర్ఘాంతపోయారు. స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా, వాసు ఫ్యాన్‌కు ఉరేసుకుని, అనిత మంచంపై విగతజీవులుగా కనిపించారు. కొడుకు, కోడలిని ఆ స్థితిలో చూసి తల్లి అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయింది.ఈ ఘటనలో అత్యంత విషాదకరమైన విషయం ఏమిటంటే, అనిత గర్భంలో ఉన్న బిడ్డను బతికించేందుకు పోలీసులు ఆమెను హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. అయితే, అప్పటికే గర్భంలోని ఆడశిశువు కూడా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.వాసు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వాసు ఉరేసుకుని ఉండగా, అనిత మంచంపై పడి ఉండటంతో.. భార్యకు విషమిచ్చి లేదా హత్య చేసి వాసు ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, పెళ్లైన నాటి నుంచి వారిద్దరూ ఎంతో ఆనందంగా, అన్యోన్యంగా ఉండేవారని, వారి మధ్య ఎలాంటి గొడవలు లేవని తల్లి, బంధువులు పోలీసులకు తెలిపారు. దీంతో వారి మృతికి గల కారణాలపై మిస్టరీ నెలకొంది. పోలీసులు చుట్టుపక్కల వారిని విచారిస్తూ ఆధారాలు సేకరిస్తున్నారు.

# మహిళల ప్రపంచకప్ గెలుపు , భావోద్వేగానికి గురైన రోహిత్


**తొలిసారి మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత్**

**కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలో చారిత్రక గెలుపు**

**మ్యాచ్‌కు హాజరైన టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ**

**మహిళల విజయం చూసి కన్నీళ్లు పెట్టుకున్న హిట్ మ్యాన్**

**రోహిత్ భావోద్వేగపు వీడియో సోషల్ మీడియాలో వైరల్**





భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. కోట్లాది మంది అభిమానుల కలలను సాకారం చేస్తూ తొలిసారిగా వన్డే ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడింది. ఆదివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని టీమిండియా అద్భుత ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించింది.ఈ ఉత్కంఠభరితమైన తుది పోరులో సఫారీ జట్టుపై 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత జట్టు, కీలకమైన చివరి క్యాచ్‌ను కూడా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌరే అందుకోవడం విశేషం. నడిన్ డి క్లర్క్‌ను ఔట్ చేసిన ఆ క్యాచ్‌తో స్టేడియంలో సంబరాలు అంబరాన్నంటాయి.ఈ చారిత్రక విజయాన్ని వీక్షించేందుకు భారత పురుషుల జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా స్టేడియానికి హాజరయ్యాడు. మహిళల జట్టు ప్రపంచకప్‌ను గెలిచిన క్షణంలో అతను తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఆనందంతో అతని కళ్లు చెమర్చాయి. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.స్వదేశంలో ప్రపంచకప్ గెలవడంలో ఉండే ఆనందం, ఫైనల్లో ఓడిపోవడంలో ఉండే బాధ రోహిత్‌కు బాగా తెలుసు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా ఓటమి చవిచూసినప్పుడు కెప్టెన్‌గా రోహిత్ ఎంతగానో నిరాశ చెందాడు. ఇప్పుడు మహిళల జట్టు ఆ కలను నెరవేర్చడంతో తన ఆనందాన్ని ఆపుకోలేకపోయాడు.

# చేవెళ్ల ప్రమాదం నింపిన విషాదం

**ఒకే ఫ్యామిలీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతి**

**చేవెళ్ల బస్సు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి**

**తాండూరు గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు మృతి**



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు ఈ ప్రమాదంలో మృత్యుఒడిలోకి చేరారు. అక్కాచెల్లెళ్లు తనూష, సాయి ప్రియ, నందిని మృతి చెందినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు.

**అంతలోనే అంతులేని విషాదం :** హైదరాబాద్ నగరంలోని కోఠి మహిళా కళాశాలలో చదువుతున్న ఆ ముగ్గురు అక్కాచెల్లెళ్లు, గత నెల 15వ తేదీన జరిగిన ఓ పెళ్లి వేడుకలో ఆనందంగా గడిపారు. ఈ ప్రమాద విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎల్లయ్య గౌడ్ పొట్టకూటి కోసం డ్రైవర్‌గా పని చేస్తూ పిల్లల్ని చదివించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఒక కుమార్తెకు ఇప్పటికే వివాహం కాగా, మిగిలిన ముగ్గురు కుమార్తెలు ఇవాళ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.మరోవైపు యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిల రెడ్డి అనే యువతి కూడా ఇదే ప్రమాదంలో మృతి చెందారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో అఖిల తల్లి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కుమార్తె ఇక లేదనే విషయం తెలిసి వారు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

# చేవెళ్ల ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి

**మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ప్రకటన**

**రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఆర్టీసీ బస్సు, కంకర లారీ ఢీకొని 24 మంది దుర్మరణం**

**ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ**

**మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం**

**గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సాయం**




రంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఆర్టీసీ బస్సు, కంకర లారీ ఢీకొన్న ఘటనలో 24 మంది ప్రయాణికులు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, కంకర లోడుతో వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ఘోర దుర్ఘటన జరిగింది.ఈ ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. అదేవిధంగా గాయపడిన వారికి రూ. 50 వేల పరిహారం అందిస్తామని వెల్లడించారు. ప్రమాద వార్త తెలియగానే స్థానిక అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు.

# ఆఫ్ఘన్ లో తెల్లవారుజామున పెను భూకంపం

**నిద్రలోనే పోయిన ప్రాణాలు**

**పది మందికి పైగా మృతి.. 260 మందికి పైగా గాయాలు**

**పెను బీభత్సం సృష్టించిన భూకంపం.. కూలిన ఇళ్ల కింద చిక్కుకున్న జనం**


**ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం.. రిక్టర్ స్కేలుపై 6.3 తీవ్రత నమోదు**





ఆఫ్ఘనిస్థాన్ ను పెను భూకంపం వణికించింది. సోమవారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. మజార్ ఏ షరీఫ్ నగరంతో పాటు చుట్టుపక్కల బీభత్సం సృష్టించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3 పాయింట్లుగా నమోదైంది. భూకంపం ధాటికి పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇప్పటి వరకు పదిమందికి పైగా మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో 260 మందికి పైగా గాయపడ్డారని వివరించారు. కూలిన ఇళ్ల శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకుని ఉంటారని, మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. భూకంపానికి సంబంధించిన పలు వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడైంది. 28 కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమై ఉంది. దీంతో సమీప ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

# పడక గది పచ్చగా..



పడక గది పచ్చగా కళకళలాడాలంటే.. కుండీల్లో మొక్కలను పెంచుకోవాల్సిందే! కాకుంటే.. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే సూర్యరశ్మి కావాల్సిందే! అలాంటప్పుడు సూర్యరశ్మి అవసరం లేని మొక్కలను ఎంచుకుంటే చాలు. కొన్ని మొక్కలు తక్కువ కాంతిలోనే చక్కగా పెరుగుతాయి. కాబట్టి, బెడ్రూములోనూ వాటిని భేషుగ్గా పెంచుకోవచ్చు.

**ఫిలోడెండ్రాన్ ప్లాంట్ :** గాలిని శుద్ధి చేయడంలో ఈ మొక్క సమర్థంగా పనిచేస్తుంది. కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇల్లు కట్టుకున్నవారికి ఈ మొక్క వరంలాంటిదే! దీన్ని కుండీలో పెంచుకొని.. పడగ గదిలో ఓ మూలన పెట్టేస్తే చాలు. తగినంత సూర్యరశ్మి లేకున్నా.. చక్కగా పెరుగుతుంది. గాలిని శుద్ధి చేస్తుంది. దీన్ని పెంచడం కూడా చాలా సులభం. చీడపీడలు సోకే అవకాశం కూడా ఉండదు. తగినన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది.

**సింగోనియం ప్లాంట్ :** దీనికే 'యారోహెడ్' అని పేరు. ఈ మొక్క ఆకులు బాణపు తలల్లా ఉంటాయి. కాబట్టే.. ఆ పేరొచ్చింది. ఇవికూడా సులభంగా పెరుగుతాయి. ఆక్సిజన్‌ను పుష్కలంగా అందిస్తుంది. గాలిని శుద్ధి చేస్తుంది. చిన్నచిన్న కుండీల్లోనూ చక్కగా పెరుగుతాయి. పడక గదికి కొత్త అందాన్ని తీసుకొస్తాయి.

# బరువు తగ్గాలనుకుంటున్నారా?

**రోజూ ఇలా ట్రై చేస్తే మంచిదంటున్న నిపుణులు!**

**బరువును అదుపులో పెట్టుకోవడం పెద్ద కష్టమేమీ కాదట!**

**ఏం చేయాలో వివరిస్తున్న నిపుణులు!**



బరువు తగ్గటమనేది అంత త్వరగా సాధ్యమయ్యేది కాదు. దీనికి కాస్త సమయం పడుతుంది. డైటింగ్, చక్కటి పోషకాహారం తీసుకోవడం, వ్యాయామ నియమాలను పాటించటం అత్యవసరం. అధిక బరువుతో డయాబెటిస్, హైబీపీ వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు పెరగడంతో పాటు కొన్నిరకాల క్యాన్సర్లూ తలెత్తొచ్చని నిపుణులు చెబుతున్నారు. వయసు మీద పడుతున్నప్పుడు చురుకుదనమూ తగ్గుతుందని పేర్కొంటున్నారు. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు. అలాగని మరీ త్వరగా బరువు తగ్గటమూ మంచిది కాదంటున్నారు. దీనికీ ఒక పద్ధతి ఉందని సూచిస్తున్నారు. మరి, అదెంటో ఇప్పుడు తెలుసుకుందాం!శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల అదనపు శక్తి కొవ్వుగా మారి, బరువు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. సమతులాహారం తినకపోవటం, నిద్రలేమి, తగినంత శ్రమ చేయకపోవటం వంటి రకరకాల అంశాలు దీనికి కారణమవుతుంటాయని అంటున్నారు. అలాగే, బరువు పెరగటంలో కొన్ని రకాల జన్యువులు, మందులూ దీనికి దోహదం చేయొచ్చని పేర్కొంటున్నారు. కాబట్టి, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవటం ఎంతైనా అవసరమని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలితో బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదని, చిన్న చిన్న మార్పులే పెద్ద ప్రభావాన్ని చూపుతాయని వెల్లడిస్తున్నారు.

**లెక్క ప్రకారం :** శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి ఆధారంగా బరువును లెక్కిస్తారు. ఇది 18.5–24.9లోపు ఉండటం మంచిదని, 25 నుంచి 29.6 మధ్యలో ఉంటే అధిక బరువుగా.. 30, అంతకన్నా ఎక్కువుంటే ఊబకాయంగా పరిగణిస్తారని %చీ×ఎ% అధ్యయనం పేర్కొంది. బరువును లెక్కించటానికి తేలికైన, సత్వర మార్గమే అయినప్పటికీ, ఇందులో కొవ్వు మోతాదు కచ్చితంగా తెలియదంటున్నారు నిపుణులు. శరీరంలోని నీరు, కండరాలు, ఎముకల బరువులన్నీ బీఎంఐలో కలిసే ఉంటాయని చెబుతున్నారు. వాస్తవానికి, ఎక్కువ ప్రమాదం అధిక కొవ్వుతోనే అని తెలియజేస్తున్నారు. దీని మూలంగా పెరిగినట్టయితే నెమ్మదిగా, వారానికి 450 నుంచి 900 గ్రాముల వరకు తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. కొందరు త్వరగా బరువు తగ్గటం మంచిదని అనుకుంటారు. కానీ, ఎంత త్వరగా తగ్గితే అంతే వేగంగా పెరిగే ప్రమాదముంటుందని వివరిస్తున్నారు. నెమ్మదిగా, క్రమంగా తగ్గే బరువు స్థిరంగా కొనసాగుతూ వస్తుందని పేర్కొంటున్నారు.

**ఆహారం విషయంలో :** బరువు తగ్గటానికి.. ఆహారం ద్వారా లభించే కేలరీలను తగ్గించుకోవటంతో పాటు కేలరీలు ఎక్కువ ఖర్చయ్యేలా శారీరక శ్రమ చేయటం తప్పనిసరంటున్నారు నిపుణులు. రోజులో శరీరం ఖర్చు చేసే కేలరీల కన్నా సుమారు 500 తక్కువ కేలరీలు తీసుకుంటే బరువు తగ్గుతారని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో వారానికి సుమారు 900 గ్రాముల బరువు తగ్గే అవకాశముందని చెబుతున్నారు. కాబట్టి కేలరీలు ఎక్కువగా ఉండే పదార్థాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, వనస్పతి వంటి ట్రాన్స్‌ఫ్యాట్స్ తగ్గించుకోవాలని సలహా ఇస్తున్నారు. రోజూ రకరకాల కూరగాయలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పాల పదార్థాలు.. మాంసాహారులైతే చికెన్, చేపల వంటివన్నీ సమపాళ్లలో తీసుకోవటం ముఖ్యమంటున్నారు నిపుణులు. మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఆయా పదార్థాలను ఎంచుకుంటే మధ్యలో కట్టు తప్పకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. శారీరక శ్రమను పెంచడం, ఆహారపు అలవాట్లను మార్చడం ద్వారా కేలరీలు తీసుకోవడం తగ్గించుకోవాలని %చీఫ్ఱశీఖ్రీ ూఱఎత్ఖుతీఎ శీట వీవసఱఅఎఱఅవ% అధ్యయనం పేర్కొంది.ఈ క్రమంలో కేలరీలను లెక్కించుకొని తినటం ఎలా సాధ్యమని చాలామంది అనుకుంటారు. కానీ, మితంగా తినేలా చూసుకుంటే చాలావరకు కేలరీలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న పళ్లాన్ని ఎంచుకుంటే వడ్డించుకునే పదార్థాల పరిమాణమూ తగ్గుతుందంటున్నారు. అలాగే ఆహారాన్ని పూర్తిగా నములుతూ, ఆస్వాదిస్తూ తినటం మంచిదని, గబగబా మింగేస్తే కడుపు నిండిన విషయం మెదడుకు తెలియదని పేర్కొంటున్నారు. దీంతో మరింత ఎక్కువ తినే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

**శ్రమ సాయం :** క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం వల్ల బరువు, రక్తపోటు, ఒత్తిడి తగ్గుతుందని %ూఎవతీఱఛుఅ ఎఖుతీ-ూంంశీఎఱఛ్ఱశీఅ% అధ్యయనం పేర్కొంది. గుండె, శ్వాస వేగాలను పెంచే వ్యాయామాలైతే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వేగంగా నడవటం, ఈత కొట్టటం, డ్యాన్స్ చేయటం వంటివన్నీ బరువు తగ్గడానికి దోహదం చేస్తాయంటున్నారు. ఎంత మంచివైనా వ్యాయామాలను ఒకేసారి వేగంగా చేయకూడదని, క్రమంగా వేగం పెంచుకుంటూ రావాలని సూచిస్తున్నారు. బద్ధకంగా కూర్చోవటానికి బదులు తేలికైన వ్యాయామాలైనా చేయాలని, వీటితోనూ కేలరీలు ఖర్చవుతాయని పేర్కొంటున్నారు. లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కటం, అప్పుడప్పుడూ లేచి కాసేపు నడవటం వంటి చిన్న మార్పులైనా మంచి ఫలితం చూపిస్తాయని సలహా ఇస్తున్నారు. బరువులు ఎత్తటం వంటి కండరాలను దృఢం చేసే వ్యాయామాలనూ మరవరాదని, పెద్దవాళ్లు వారానికి కనీసం రెండు రోజులైనా ఇలాంటివి సాధన చెయ్యాలని పేర్కొంటున్నారు.

# షుగర్ పేషెంట్స్ సీతాఫలం' తినొచ్చా?

**సీతాఫలంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు - గుండె పనితీరును మెరుగుపరుస్తుందని నిపుణుల వెల్లడి!**



ప్రకృతి ప్రసాదించే అద్భుతమైన పండ్లలో సీతాఫలం ఒకటి. ఆపిల్ రంగూ, మామిడి రుచీ లేని కొండ పండు ఇది. అయితే ఎంత తిన్నా తనివి తీరని ఈ పండు ఎన్నో అనారోగ్యాల్ని నయం చేస్తుందంటున్నారు నిపుణులు. సీతాఫలంలో ఉండే ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అనేవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహకరిస్తాయని చెబుతున్నారు. మరి డయాబెటిస్?తో ఇబ్బందిపడేవారు ఈ పండ్లను తినొచ్చా? అనే వివరాలు ఇప్పుడు చూద్దాం.

**రోగనిరోధక శక్తి పెరుగుదల :** సీతాఫలంలో ఎ, సి, బి6 వంటి విటమిన్లతో పాటు కాపర్, పొటాషియం, పీచు వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా లభిస్తాయంటున్నారు నిపుణులు. ఇందులోని విటమిన్ సి అనేది రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, అనేక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుందని The Pharma Innovation Journal ప్రచురించింది. అలాగే, ఇందులోని యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు శరీరంపై ఏర్పడిన వాపును తగ్గించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు.

'గుండెకు' ముప్పు తెచ్చే అలవాట్లు ఇవే! – వీటికి దూరంగా ఉండాలంటున్న నిపుణులు

**గుండె ఆరోగ్యానికి :** సీతాఫలంలో అధిక మెగ్నీషియం కంటెంట్ మృదువైన గుండె కండరాలను సడలించి, స్ట్రోక్, గుండెపోటును నివారిస్తుందని అధ్యయనం పేర్కొంది. ఇందులోని ఫైబర్, నియాసిన్ శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**షుగర్ కంట్రోల్ :** ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల చక్కెర శోషణ నెమ్మదిగా జరుగుతుందంటున్నారు నిపుణులు. తద్వారా టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. సీతాఫలంలో గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుందని, ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్స్? డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. అయితే మరీ ఎక్కువ మొత్తంలో కాకుండా మితంగా, డాక్టర్ల సూచన మేరకు తినాలని చెబుతున్నారు.

**గర్భిణులకు :** గర్భం దాల్చిన మహిళల్లో వేవిళ్లు, మూడ్ స్వింగ్స్?, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం లాంటి సమస్యలు కామన్?. అయితే వీటిని సీతాఫలంతో చెక్ పెట్టొచ్చంటున్నారని నిపుణులు. ఇందులో కాపర్ ఎక్కువ మొత్తంలో లభిస్తుందని, దీంతో శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయంటున్నారు. అంతేకాకుండా, పిండం అభివృద్ధిలో సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. గర్భాధారణ సమయంలో సీతాఫలం తినడం వల్ల, పుట్టబోయే శిశువు మెదడు, నాడీ వ్యవస్థ, రోగనిరోధక శక్తి అభివృద్ధికి తోడ్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో గర్భిణులకు కాపర్ తక్కువైతే పూర్తిగా నెలలు నిండకుండానే బిడ్డ పుట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, వీరు సీతాఫలం తినడం మంచిదని సూచిస్తున్నారు.

**బరువు అదుపులో :** సీతాఫలంలో కొవ్వులు, క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే, ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావన కలిగేలా చేస్తుందంటున్నారు నిపుణులు. దీంతో ఎక్కువ సమయం ఆకలేయకుండా, చిరుతిండ్ల జోలికి పోకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. తద్వారా క్రమంగా బరువు తగ్గచ్చని సూచిస్తున్నారు. ఇందులో ఉండే విటమిన్ బి6 కడుపుబ్బరం, అజీర్తి, అల్సర్లు వంటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుందని పేర్కొంటున్నారు.

**పీసీఓఎస్ ఉన్నవారు :** పీసీఓఎస్ ఉన్న వారిలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా అలసట, నీరసం, మూడ్ స్వింగ్స్, చికాకు వంటివి సర్వసాధారణంగా ఉంటాయి. అయితే వీటన్నింటికీ ఐరన్ విరుగుడుగా పనిచేస్తుందని, సీతాఫలంలో అది ఎక్కువగా లభిస్తుందని అంటున్నారు నిపుణులు. కాబట్టి, పీసీఓఎస్ ఉన్న వారూ ఈ పండు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే, ఇది సంతాన సాఫల్యతను సైతం పెంచుతుందని తెలియజేస్తున్నారు.

**ఇవీ కూడా :**

ఈ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు క్యాన్సర్లు రాకుండా రక్షిస్తాయి.ఇందులో బి- కాంప్లెక్స్ అధికంగా ఉండటం వల్ల మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఒత్తిడి, ఆందోళన తగ్గించడంలో సహాయపడుతుంది.ఈ పండులో విటమిన్ రైబోఫ్లేవిన్ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్?తో పోరాడి కంటిచూపును మెరుగుపరచడంతో పాటు కంటి సమస్యల్ని నివారిస్తాయి.సీతాఫలంలో అధికంగా ఉండే డైటరీ పీచు పదార్థం జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.అయితే సీతాఫలం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది కదా అని ఎక్కువగా తినడం కూడా శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు. అలాగే వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ పండు మోతాదు విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే నిపుణుల్ని అడిగి తెలుసుకోవడం మంచిదంటున్నారు.

# ధనియాలతో నీళ్లను ఇలా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!



జశీతీఱఅనవతీ ూవవసం ఔష్వతీ% ఎ ధనియాలను మనం వంటి ఇంటి మసాలా దినుసులుగా ఎప్పటినుంచో ఉపయోగిస్తున్నాం. అయితే ఆయుర్వేద ప్రకారం ఈ దినుసులు అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. పలు ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ ధనియాలను ఉపయోగిస్తారు. అలాగే మసాలా వంటకాల్లోనూ వీటిని వాడుతారు. అయితే కేవలం రుచి, వాసనను అందిండమే కాదు, మనకు ఇవి ఆరోగ్య ప్రయోజనాలను కలగజేస్తాయి. ధనియాలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలతో తయారు చేసే నీళ్లను తాగితే ఎంతో మేలు జరుగుతుందని వారు చెబుతున్నారు. ధనియాల నీళ్లను తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు తగ్గిపోతాయి.

## షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్‌కు..

ధనియాల నీళ్లను తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను బాగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ధనియాల నీళ్లను తాగితే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. వీటిల్లో క్వర్సెటిన్, టెర్పినైన్, టోకోఫెరాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ధనియాల నీళ్లను తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె సురక్షితంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

## ఏ సమయంలో తాగాలి..?

బరువు తగ్గాలనుకునే వారు, లివర్ వ్యాధులు ఉన్నవారు, చర్మ సమస్యలకు కూడా ధనియాల నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మోకాళ్లు, కీళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ధనియాల నీళ్లను తాగితే మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా మారుతారు. నీరసం, అలసట తగ్గిపోతాయి. ధనియాల నీళ్లను రోజూ ఉదయం పరగడుపునే తాగవచ్చు. లేదా భోజనం చేయడానికి 45 నిమిషాల ముందు తాగాలని ఆయుర్వేదం చెబుతోంది. ధనియాలను రాత్రి పూట నీటిలో నానబెడితే మరుసటి రోజు మొత్తం ఆ నీళ్లను కొద్ది కొద్దిగా కూడా తాగుతూ ఉండవచ్చు.

## ఇలా కూడా చేయవచ్చు..

ఇక ధనియాల నీళ్లను కేవలం ధనియాలను నానబెట్టి మాత్రమే కాదు, ధనియాలను నీటిలో వేసి మరిగించి కూడా తయారు చేయవచ్చు. ఇలా ఏ రకంగా అయినా సరే ధనియాల నీళ్లను తయారు చేసి తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలు అనేక వ్యాధులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయని అంటున్నారు. అలర్జీలు ఉన్నవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు ధనియాల నీళ్లను తాగకూడదు.

# రోజూ దీన్ని 2 కప్పులు తాగితే చాలు.. చెప్పలేనన్ని లాభాలు కలుగుతాయి..!



రోజూ ఉదయం నిద్ర లేచిన దగ్గరి నుంచి రాత్రి మళ్లీ నిద్రించే వరకు చాలా మంది టీ, కాఫీలను అధికంగా తాగుతుంటారు. వాతావరణం చల్లగా ఉంటే టీ, కాఫీలు ఇంకా ఎక్కువగా తాగుతారు. అయితే టీ, కాఫీలకు బదులుగా హెర్బల్ టీలను తాగితే ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని, దీంతోపాటు టీ, కాఫీ తాగిన ఫీలింగ్ కూడా కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. ఈ క్రమంలోనే మనకు తాగేందుకు అనేక రకాల హెర్బల్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కొంబుచా టీ కూడా ఒకటి. టీ, చక్కెర, బ్యాక్టీరియా, ఈస్ట్‌ను కలిపి పులియబెట్టి ఈ టీ పొడిని తయారు చేస్తారు. దీన్నే కొంబుచా టీ అంటారు. ఇది అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొంబుచా టీని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని వారు అంటున్నారు.

## జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

కొంబుచా టీ అంటే పులియబెట్టబడింది కనుక ఈ టీని సేవిస్తే ప్రోబయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. అంటే ఈ టీ మన జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అజీర్తి తగ్గుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మలబద్దకం తగ్గిపోతుంది. విరేచనాలు, ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ (ఐబీఎస్) వంటి సమస్యలు ఉన్నవారు కొంబుచా టీని సేవిస్తుంటే ఉపశమనం లభిస్తుంది. కొంబుచా టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండడం వల్ల ఈ టీని సేవిస్తుంటే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, వయస్సు మీద పడడం వల్ల వచ్చే జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చు.

## లివర్ ఆరోగ్యానికి..

కొంబుచా టీ లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం రోజూ ఈ టీని తాగుతుంటే అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్ కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో లివర్‌లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. లివర్ క్లీన్ అవుతుంది. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గుతుంది. లివర్ సంబంధిత వ్యాధులు ఉన్నవారికి ఈ టీ ఎంతగానో మేలు చేస్తుంది. ముఖ్యంగా మద్యం కారణంగా వచ్చిన ఫ్యాటీ లివర్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొంబుచా టీని తాగితే మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

## డయాబెటిస్ ఉంటే..

ఈ టీని తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గిపోతాయి. కొంబుచా టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కొంబుచా టీని తాగడం వల్ల శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ టీ బరువును కూడా తగ్గించగలదు. దీన్ని తాగితే శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు త్వరగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు ఈ టీని డైట్‌లో కచ్చితంగా చేర్చుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇలా కొంబుచా టీని రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# జీఎస్టీ, ఆటో సేల్స్ కీలకం! దేశీయ స్టాక్ మార్కెట్లు లాభనష్టాల మధ్య ఊగిసలాడుతున్నాయి.



మదుపరులు పెట్టుబడులు, అమ్మకాల ఒత్తిడి నడుమ కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో సూచీలకు ఒడిదొడుకులు తప్పట్లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే.. నష్టాలకే పరిమితమయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభనష్టాల మధ్య ఊగిసలాడుతున్నాయి. మదుపరులు పెట్టుబడులు, అమ్మకాల ఒత్తిడి నడుమ కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో సూచీలకు ఒడిదొడుకులు తప్పట్లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే.. నష్టాలకే పరిమితమయ్యాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 273.17 పాయింట్లు లేదా 0.32 శాతం పడిపోయి 83,938.71 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 73.05 పాయింట్లు లేదా 0.28 శాతం దిగజారి 25,722.10 దగ్గర నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేస్తారన్న అంచనాలున్నాయి. అయినప్పటికీ అక్టోబర్ నెలకుగాను దేశీయ వాహన అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాలు ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహం తీసుకొస్తే కొనుగోళ్లకు ఆసక్తి కనబర్చవచ్చు.కాబట్టి ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్ల ట్రేడింగ్‌ను ప్రభావితం చేస్తాయన్న అభిప్రాయాలైతే మెజారిటీ నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇక ఎప్పట్లాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, ఇతర అంతర్జాతీయ పరిణామాలు ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,900-26,200 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.గమనిక..స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయి ఉత్పత్తి..

# సంవత్ 2082 సిఫార్సులివే.. దేశీయ స్టాక్ మార్కెట్లలో కొత్త సంవత్సరం మొదలైంది.




ఈ దీపావళితో సంవత్ 2082 వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికిగాను ఆయా ప్రధాన బ్రోకరేజీ సంస్థలు తమ అంచనాలను, సిఫార్సులను ప్రకటించాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో కొత్త సంవత్సరం మొదలైంది. ఈ దీపావళితో సంవత్ 2082 వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికిగాను ఆయా ప్రధాన బ్రోకరేజీ సంస్థలు తమ అంచనాలను, సిఫార్సులను ప్రకటించాయి. మదుపరులు ఏయే షేర్లలో పెట్టుబడులు పెడితే లాభిస్తుందో పేర్కొన్నాయి. ఆ వివరాల్లోకి వెళ్తే..ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌ఈ బ్రోకరేజీ.. బజాజ్ ఫైనాన్స్, దివీస్ ల్యాబ్స్, నైకా, ఎస్బీఐ, ఎస్బీఐ కార్డ్స్, స్విగ్గీ వంటి షేర్లను సిఫార్సు చేస్తున్నది. ఈ ఏడాది ఇవి ఆకర్షణీయమనిపేర్కొ ంటున్నది.ఐసీఐసీఐ డైరెక్ట్‌హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్, ఏఐఏఇంజినీరింగ్, కేన్స్ టెక్నాలజీ, డాటాప్యాటర్న్స్,గ్రీన్‌లామ్‌ఇండస్ట్రీస్‌లలో పెట్టుబడులు లాభదాయకం అని ఐసీఐసీఐ డైరెక్ట్ అంచనా వేస్తున్నది.హెచ్‌డీఎఫ్‌సీసెక్యూ రిటీస్‌అసోసియేటెడ్ ఆల్కహాల్స్ అండ్ బ్రూవరీస్,హ్యాపీఫోర్జింగ్స్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ,భారతీ ఎయిర్‌టెల్, ఐడీఎఫ్‌సీఫస్ట్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, నార్తర్న్ ఏఆర్‌సీ క్యాపిటల్, షీలా ఫోం, ఎంఎస్‌టీసీ, పిడిలైట్ ఇండస్ట్రీస్ షేర్లు మంచి రాబడులనుకర్షణీయమనిపేర్కొ ంటున్న అందిస్తాయన్న విశ్వాసాన్ని ఈ బ్రోకరేజీ వ్యక్తం చేస్తున్నది.జేఎం ఫైనాన్షియల్‌మారుతీ సుజుకీ, ఫియం ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్, అపోలో హాస్పిటల్స్, లాయిడ్స్ మెటల్స్, రత్నమణి మెటల్స్, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్, అనంత్ రాజ్, యూరేకా ఫోర్బ్స్, ఆస్ట్రల్ షేర్లను జేఎం ఫైనాన్సియల్ సిఫార్సు చేస్తున్నది%జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌టాటా మోటర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోల్ ఇండియా, ఇన్ఫోసిస్, బజాజ్ ఆటో షేర్లలో పెట్టుబడులు ఈ ఏడాది లాభదాయకం అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ భావిస్తున్నది.చాయిస్ బ్రోకింగ్‌బీడీఎల్, అశోక్ లీలాండ్, సెయిల్, ఫెడరల్ బ్యాంక్, సిప్లా షేర్లు ఈ బ్రోకరేజీ ప్రధాన సిఫార్సు.ఏంజిల్ వన్‌వీఏ టెక్ వాబ్యాగ్, ఐఈఎక్స్, సాగిలిటి, స్కిప్పర్, ట్రాన్స్‌రైల్ లైటింగ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఆప్టస్ వాల్యూ హౌజింగ్ షేర్లను ఈ బ్రోకరేజీ సిఫార్సు చేస్తున్నది.ఆనంద్ రాఠీఅవెన్యూ సూపర్‌మార్ట్స్, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్, బీఎస్ఈ లిమిటెడ్, ఫియం ఇండస్ట్రీస్, శక్తీ పంప్స్, బ్లాక్‌బక్ షేర్లు లాభదాయకం అంటున్నది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు పాలసీ మద్దతు, తయారీ రంగం బలోపేతం వంటి అంచనాలతో ఈ సిఫార్సులు చేస్తున్నది.యాక్సిస్ సెక్యూరిటీస్‌రెయిన్‌బో చిల్డ్రన్ మెడికేర్, డోమ్స్ ఇండస్ట్రీస్, కేఈసీ ఇంటర్నేషనల్, చాలెట్ హోటల్స్, మిందా కార్ప్, కొటక్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, కాఫోర్జ షేర్లు ఆకర్షణీయమన్నది యాక్సిస్ సెక్యూరిటీస్ అభిప్రాయం.కొటక్ ఈక్విటీస్‌ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, అకుటాస్ కెమికల్, కుమ్మిన్స్ ఇండియా, ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో పెట్టుబడులు ఈ బ్రోకరేజీ లాభదాయకమంటున్నది.జియోజిత్‌జిఎస్బీఐ, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యునిలివర్, మారుతీ, యాక్సిస్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, హీరో, సుజ్లాన్ ఎనర్జీ, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, కెన్‌ఫిన్ హోమ్స్, హెచ్‌జీ ఇన్‌ఫ్రా షేర్లను సిఫార్సు చేస్తున్నది.గమనిక: ఈ సిఫార్సులు, అంచనాలు మదుపరుల అవగాహన కోసమే. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు తీవ్ర ఒడిదొడుకులకు లోనై ఉంటాయి. కాబట్టి మదుపు చేసే ముందు నిపుణుల సలహా తీసుకుని, మరింత జాగ్రత్తగా ముందుకెళ్లడం ఉత్తమం.

## ఈ ఐదూ మరువద్దు.. యువ ఉద్యోగుల ఆర్థిక ప్రణాళికల కోసం నిపుణుల సలహాలు కెరియర్ ఆరంభంలో ఆదాయ,

వ్యయాల్లో తరచూ మార్పులు చోటుచేసుకుంటూ ఉంటాయి. కాబట్టి మీ అవసరాలు, జీవనశైలి, చిన్నపాటి అత్యవసర నిధితో ఓ బడ్జెట్‌ను పెట్టుకోండి. యువ ఉద్యోగుల ఆర్థిక ప్రణాళికల కోసం నిపుణుల సలహాలుసౌకర్యవంతమైన బడ్జెట్‌కెరియర్ ఆరంభంలో ఆదాయ, వ్యయాల్లో తరచూ మార్పులు చోటుచేసుకుంటూ ఉంటాయి. కాబట్టి మీ అవసరాలు, జీవనశైలి, చిన్నపాటి అత్యవసర నిధితోఓబడ్జెట్‌నుపెట్టుకోండి.కానీ దీన్ని కచ్చితంగా పాటించనవసరం లేదు. ఈ బడ్జెట్ లక్ష్యం కేవలం ఎలాంటి ఒత్తిళ్లు, ఆంక్షలు లేని ఆర్థిక క్రమశిక్షణనుఅలవర్చుకోవడానికి అంతే.ఆరోగ్య బీమా కీలకంఆరోగ్య బీమా విషయంలో రాజీ పడవద్దు. మీకు, మీ కుటుంబ సభ్యులకు తగిన రీతిలో ఆరోగ్య బీమా అవసరం. ముఖ్యంగా మీరు పనిచేస్తున్న సంస్థ ద్వారా అందే ఆరోగ్య బీమా పరిమితంగా ఉన్నప్పుడు.. సమగ్ర స్థాయిలో హెల్త్ ఇన్సూరెన్స్‌ను తీసుకోవాల్సిందే. ఇక జీవిత బీమా ఈ సమయంలో తప్పనిసరి ఏం కాదు. మీ మీద ఆధారపడి ఉన్నవారు ఉన్నప్పుడే లైఫ్ ఇన్సూరెన్స్‌పై దృష్టి పెట్టండి. అన్నింటి కంటే ముఖ్యంగాపన్నులను ఆదా చేయడానికే బీమాను తీసుకోవద్దుదీర్ఘకాల పెట్టుబడులు వద్దుకెరియర్ ఆరంభంలో ఇంటిని కొనుగోలు చేయడం అంతగా తెలివైన నిర్ణయమైతే కాదు. దీనివల్ల మీపై దీర్ఘకాలంగా ఆర్థిక భారం పడగలదు. కనుక మీ కష్టార్జితం ఏండ్ల తరబడి ఒక్కే దగ్గర చిక్కుకునేలా నిర్ణయాలు తీసుకోకండి. స్వల్పకాలిక పెట్టుబడులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలనుఅన్వేషించండి.ఈ ఎల్ఎస్ఎస్‌యువ సంపాదనపరులు ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీము (ఈఎల్ఎస్ఎస్)లను పరిశీలించడం ఉత్తమం. దీనివల్ల స్టాక్ మార్కెట్ లాభాలను ఒడిసి పట్టుకోవచ్చు. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కిందపన్నుమినహాయింపు ప్రయోజనాలనూ పొందవచ్చు. కాబట్టి సంప్రదాయ పన్ను ఆదా పెట్టుబడి సాధనాల కంటే.. మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఈఎల్ఎస్ఎస్‌లోకి ప్రవేశించి, షార్ట్‌లాకిన్‌పీరియడ్‌లో పెట్టుబడులకు దిగండి.అయితేస్టాక్‌మార్కెట్ పెట్టుబడులు తీవ్ర ఒడిదొడుకులకు లోబడి ఉంటాయి. కనుక పరిమిత స్థాయిలో,నిపుణుల మార్గదర్శకత్వంలో ముందుకెళ్తే మంచిది.క్ష్యాలకు తగినట్టుగా..మ్యూచువల్ ఫండ్స్, ప్రావిడెంట్ ఫండ్ వంటి పెట్టుబడి సాధనాలపై దృష్టి పెట్టండి. ఇవి మీ లక్ష్య సాధనకు వీలుగా ఉంటాయి. ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా మీ దీర్ఘకాలిక లక్ష్యాలనూ నెరవేర్చగలవు. అలాగే అనవసరపు ఖర్చులు, అప్పుల జోలికి వెళ్లవద్దు. హంగులు, ఆర్భాటంగా ఉండే జీవనశైలికి దూరంగా ఉండండి. ప్రాధాన్యతల ఆధారంగా మీ ఆదాయాన్ని విభజిస్తే మెరుగైన ఫలితాలుంటాయి.




# ఆటోకు పండుగ కిక్కు.. కలిసొచ్చిన జీఎస్టీ రేట్ల తగ్గింపులు.. అక్టోబర్‌లో రికార్డుస్థాయి వాహన విక్రయాలు



దేశీయ మార్కెట్‌లో వాహన విక్రయాలు అదిరిపోయాయి. గత నెల అక్టోబర్‌లో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, కియా తదితర కంపెనీల కార్లు పెద్ద ఎత్తున అమ్ముడయ్యాయి. పండుగ సీజన్‌తోపాటు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపులు కలిసొచ్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశీయ మార్కెట్‌లో వాహన విక్రయాలు అదిరిపోయాయి. గత నెల అక్టోబర్‌లో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, కియా తదితర కంపెనీల కార్లు పెద్ద ఎత్తున అమ్ముడయ్యాయి. పండుగ సీజన్‌తోపాటు వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)తగ్గింపులు కలిసొచ్చాయనిమార్కెట్‌నిపుణులు విశ్లేషిస్తున్నారు. శనివారం ఆయా సంస్థలు విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత ఏడాది అక్టోబర్‌తో పోల్చితే ఈ ఏడాది అక్టోబర్‌లో కనిష్ఠంగా 5 శాతం నుంచి గరిష్ఠంగా 40 శాతం వరకు సేల్స్ పెరిగినట్టు తేలింది. 'మొత్తంగా అక్టోబర్‌లో గణనీయంగా కార్లు అమ్ముడయ్యాయి. నిరుడు ఇదే నెలతో చూస్తే 20 శాతానికిపైగా పెరుగుదల నమోదైంది' అని దేశీయ ఆటో రంగ దిగ్గజ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి, మార్కెటింగ్-సేల్స్ విభాగానికి చెందిన పార్థో బెనర్జీ మీడియాకు తెలిపారు.అక్టోబర్‌లో ఈ స్థాయిలో రిటైల్ అమ్మకాలు జరగడం ఇదే తొలిసారి అని చెప్పారు. ఇక నవరాత్రులతో మొదలైన 40 రోజుల పండుగ సీజన్‌లో 5 లక్షల బుకింగ్స్ ఉన్నాయని, 4.1 లక్షల రిటైల్ సేల్స్ జరిగాయని వెల్లడించారు. 2024తో పోల్చితే సుమారు ఇది రెట్టింపు అని పేర్కొన్నారు. అలాగే జీఎస్టీ రేట్ల తగ్గింపుతో చాలామంది కస్టమర్లు కార్లను కొనేందుకు ఆసక్తి చూపారని వివరించారు. కాగా, ఆరంభ శ్రేణిలో ఆల్టో, ఎస్-ప్రెస్సో మాడళ్లకు ఈసారి గిరాకీ తగ్గుముఖం పట్టగా.. కంపాక్ట్ కార్లలో బాలెనో, సెలీరియో, డిజైర్, ఇగ్నీస్, స్విఫ్ట్, వాగనార్ మాడల్స్ విక్రయాలు పెరిగాయి. బ్రెజ్జా, ఫ్రాంక్స్, ఎర్టిగా, గ్రాండ్ విటారా, ఇన్విక్టో, జిమ్నీ, విక్టోరిస్, ఎక్స్ఎల్6 వంటి యుటిలిటి వెహికిల్స్ విక్రయాలూ పుంజుకున్నాయి. ఈకో వ్యాన్‌కూ మంచి ఆదరణే లభించింది.ఇక దేశీయ మార్కెట్‌లో హ్యుందాయ్ వాహన విక్రయాలు గతంతో చూస్తే 3 శాతానికిపైగా క్షీణించాయి. క్రెటా, వెన్యూ మాడళ్లకు తప్ప మిగతా వాటికి కస్టమర్ల నుంచి అంతంతమాత్రంగానే ఆదరణ లభించింది. మరోవైపు టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన విక్రయాల్లో ఎస్‌యూవీల వాటానే 47,000 యూనిట్లకుపైగా ఉన్నది. మొత్తం అక్టోబర్‌లో 61,295 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఎలక్ట్రిక్ వెహికిల్స్ సేల్స్ కూడా నిరుడుతో పోల్చితే 5,355 యూనిట్ల నుంచి 9,286 యూనిట్లకు పుంజుకున్నాయి.నవరాత్రి, దీపావళి మధ్య లక్ష వాహనాలకుపైగా టాటా మోటర్స్ డెలివరీ చేయడం గమనార్హం. గతంతో చూస్తే ఏకంగా 33 శాతం పెరిగాయి. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో దూసుకుపోతున్న కియా ఇండియాకు ఇటీవలి కారెన్స్ క్లావిస్, కారెన్స్ క్లావిస్ ఈవీ మాడళ్లు మరింత జోష్‌నిస్తున్నాయి. అక్టోబర్ అమ్మకా ల్లో ఈ రెండింటి వాటానే 25 శాతందాకా ఉన్నది. మొత్తానికి దసరా, ధనత్రయోదశి, దీపావళి పండుగలతోపాటు జీఎస్టీ 2.0 సంస్కరణలు భారతీయ ఆటో మార్కెట్‌కు కొత్త కళను తెచ్చిపెట్టాయనే చెప్పవచ్చు.

# యంగ్‌వన్ సీఎండీ కిహక్‌సాంగ్ వెల్లడి



కొరియాకు చెందిన టెక్స్‌టైల్ సంస్థ యంగవన్..తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్లాంట్లో పూర్తి స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించడానికి సిద్ధమైంది. వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో రూ.840 కోట్ల పెట్టుబడితో 261 ఎకరాల స్థలంలో వస్త్ర పరిశ్రమను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ యూనిట్‌ను కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కిహక్‌సాంగ్ శనివారం సందర్శించారు. కొరియాకు చెందిన టెక్స్‌టైల్ సంస్థ యంగవన్..తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్లాంట్లో పూర్తి స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించడానికి సిద్ధమైంది. వరంగల్ జిల్లాలోని వచ్చే ఏడాది ప్రారంభించనున్నట్టు చెప్పారు.మిగతా ఐదు యూనిట్లకు సంబంధించి అక్కడి కంపెనీ ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. పనుల్లో వేగం పెంచి వచ్చే మార్చి నాటికి అన్ని యూనిట్లలో ఉత్పత్తులను ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం ఈ యూనిట్‌లో 300 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, మిగతా ఐదు యూనిట్లు అందుబాటులోకి వస్తే మొత్తం 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వస్త్ర పరిశ్రమకు తెలంగాణ రాష్ట్రం అనువైనది కావడంతో ఇక్కవ యూనిట్‌ను నెలకొల్పాలని ముందుకొచ్చినట్టు చెప్పారు.

# పడిపోయిన కోల్ ఇండియా ఉత్పత్తి.. అక్టోబర్‌లో 9.8 శాతం క్షీణత




బొగ్గు ఉత్పత్తిలో ప్రపంచంలో అతిపెద్ద సంస్థయైన కోల్ ఇండియా ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. అక్టోబర్‌లో 56.4 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసినట్టు ప్రకటించింది. బొగ్గు ఉత్పత్తిలో ప్రపంచంలో అతిపెద్ద సంస్థయైన కోల్ ఇండియా ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. అక్టోబర్‌లో 56.4 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసినట్టు ప్రకటించింది. కిందటేడాది ఇదే నెలలో ఉత్పత్తి చేసిన 62.5 మిలియన్ టన్నులతో పోలిస్తే 9.8 శాతం తగ్గిందని పేర్కొంది. అకాల వర్షాలు, పండుగ సెలవులు దెబ్బతీశాయి.కోల్ ఇండియాకు చెందిన సబ్సిడరీ సంస్థలు నిరాశాజనక పనితీరు కనబర్చడం కూడా కారణమే. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్యకాలంలో కంపెనీ ఉత్పత్తి కూడా 4.5 శాతం తగ్గి 385.5 మిలియన్ టన్నులకు జారుకున్నది. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న బొగ్గులో కోల్ ఇండియానే 80 శాతం ప్రొడ్యూస్ చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో 875 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఐఐబీఎక్స్‌లో ఎస్బీఐ గోల్డ్ ట్రేడింగ్

State Bank of India

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ.. ఇండియా ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్ఛేంజ్ (ఐఐబీఎక్స్)పై ప్రత్యేక కేటగిరీ క్లయింట్ (ఎస్‌సీసీ)గా చేరింది. తద్వారా ఐఐబీఎక్స్‌లో తమ మొదటి గోల్డ్ ట్రేడ్ నిర్వహించింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ.. ఇండియా ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్ఛేంజ్ (ఐఐబీఎక్స్)పై ప్రత్యేక కేటగిరీ క్లయింట్ (ఎస్‌సీసీ)గా చేరింది. తద్వారా ఐఐబీఎక్స్‌లో తమ మొదటి గోల్డ్ ట్రేడ్ నిర్వహించింది. ఈ మేరకు శనివారం బ్యాంక్ ప్రకటించింది. ఇది పరిశ్రమకు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు ప్రభావవంతమైన, పారదర్శకమైన ట్రేడింగ్‌కు కలిసిరాగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.కాగా, గత ఏడాదే ఐఐబీఎక్స్‌లో ట్రేడింగ్-కమ్-క్లియరింగ్ సభ్యత్వం సాధించిన తొలి బ్యాంక్‌గా ఎస్బీఐ అవతరించింది. ఇప్పుడు ఎస్‌సీసీగా ఎస్బీఐ చేరింది. దీంతో ఐఐబీఎక్స్ ద్వారా జరిగే పసిడి దిగుమతుల్లో జ్యూయెల్లర్స్, బులియన్ ట్రేడర్లు, ఇతర భాగస్వాములకు గొప్ప మద్దతు లభించినట్టైంది. దీనిపట్ల బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి ఆనందం వ్యక్తం చేశారు.


# జీఎస్టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లు మరింత పెరిగాయి.

జీఎస్టీ రేట్లను తగ్గించినప్పటికీ వసూళ్లు మాత్రం భారీగా పుంజుకున్నాయి. అక్టోబర్ నెలకుగాను రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జీఎస్టీ వసూళ్లు మరింత పెరిగాయి. జీఎస్టీ రేట్లను తగ్గించినప్పటికీ వసూళ్లు మాత్రం భారీగా పుంజుకున్నాయి. అక్టోబర్ నెలకుగాను రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.87 లక్షల కోట్లతో పోలిస్తే 4.6 శాతం పెరిగాయని తెలిపింది. కానీ, ప్రస్తుత సంవత్సరంలో ఇంత కనిష్ఠ స్థాయి వృద్ధిని నమోదు చేసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. సరాసరిగా ఈ ఏడాది 9 శాతం వృద్ధి నమోదైంది. సామాన్యుడికి ఊరట కల్పించాలనే ఉద్దేశంతో నరేంద్ర మోదీ సర్కార్ 375 ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చేలా తీసుకున్న నిర్ణయంతో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ధరలు భారీగా తగ్గాయి.గత నెలలో వసూలైనదాంట్లో దేశీయంగా వసూలైనవి రూ.1.45 లక్షల కోట్లు కాగా, దిగుమతి చేసుకున్న వస్తువులపై విధించిన పన్నుతో రూ.50,884 కోట్లు సమకూరాయి. ఆగస్టు నెలలో జీఎస్టీ వసూళ్లు 6.5 శాతం పెరిగి రూ.1.86 లక్షల కోట్లకు చేరుకోగా, సెప్టెంబర్‌లో 9.1 శాతం ఎగబాకి రూ.1.89 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. పండుగ సీజన్ కావడం వల్లనే జీఎస్టీ వసూళ్లు ఈ మాత్రమైన నమోదయ్యాయి. సెప్టెంబర్ 22 నుంచి భారీ జీఎస్టీ రేట్ల కోతలు అమలులోకి వచ్చినప్పటికీ పన్ను వసూళ్లు మాత్రం స్వల్పంగా పెరిగాయని, ఈ డిమాండ్ క్రమంగా పెరుగుతుందని ఆశిస్తున్నట్టు ప్రైస్ వాటర్‌హౌజ్ అండ్ కో ఎల్ఎల్‌పీ పార్ట్‌నర్ ప్రతీక్ జైన్ తెలిపారు.రాష్ట్రాల్లో పెరిగిన వసూళ్లుపలు రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు భారీగా పెరిగాయి. కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. ఆయా రాష్ట్రాల్లో తయారీరంగం, సర్వీసెస్, పండుగ సీజన్ కూడా తోడవడం కలిసొచ్చిందని జలాన్ చెప్పారు.




ముఖ్యంగా వాహన ధరలు భారీగా పడిపోవడం, పండుగ సీజన్ కూడా కావడంతో ఎగబడి కొనుగోళ్లు జరిపారు. అలాగే ఎఫ్ఎంసీజీ, దుస్తులు, ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ విభాగాలు అంచనాలకుమించి రాణించినట్టు చెప్పారు.





## హైప్ పెంచుతున్న అజయ్ ది బ్రెయిన్ లుక్స్.. ఇంతకీ ఏం ప్లాన్ చేస్తున్నాడేంటి..?

నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతోపాటు క్యారెక్టర్ ఆర్టిస్టుగా స్టార్ హీరోల సినిమాల్లో నటించి యాక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు అజయ్. ఈ టాలెంటెడ్ యాక్టర్ వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ది బ్రెయిన్. సస్పెన్స్, క్రైం కథల కోసం తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారని తెలిసిందే. ది బ్రెయిన్ కూడా ఇదే జోనర్‌లో వస్తోంది. అశ్విన్ కామరాజ్ కొప్పాల దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో అజయ్, తన్విక, బేబీ దాన్విత, అజయ్ ఘోష్, శరత్ లోహిత్, జయ చంద్ర నాయుడు, రవి కాలే, జ్యోతి నటిస్తున్నారు. ది బ్రెయిన్ షూటింగ్ చిత్తూరు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతోంది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని క్రైం సస్పెన్స్ జోనర్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని డైరెక్టర్ అశ్విన్ కామరాజ్ కొప్పాల. కేసులను ఇన్వెస్టిగేషన్ క్రమంలో సీరియస్‌గా కనిపిస్తున్నట్టు ఉన్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. మెదడుకు పుస్తెల తాడు వేలాడుతుండగా.. పైనుంచి మొలను సుత్తెతో మెదడులోకి కొడుతున్న స్టిల్ కంటెంట్‌లో ఏదో కొత్త ప్రయత్నంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు చెబుతోంది.

## ట్రెండ్ సెట్ చేసేందుకు పృథ్వీరాజ్ సుకుమారన్ రెడీ విలాయత్ బుధ షూటింగ్ ఎక్కడ జరుగుతుందో తెలుసా?



తెలుగుతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు పృథ్వీరాజ్ సుకుమారన్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తోన్న మలయాళ థ్రిల్లర్ ప్రాజెక్ట్ విలాయత్ బుధ. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ ఫొటో రూపంలో నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ చిత్రానికి జేక్స్‌బిజోయ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ క్రేజీ కంపోజర్ ట్రెండ్ సెట్టింట్ సాంగ్‌ను రెడీ చేస్తున్నాడు. ప్రస్తుతం విలాయత్ బుధ ప్రోమో సాంగ్ షూటింగ్‌ను కోచిలో షూట్ చేస్తున్నారు. త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుందని తెలియజేశారు మేకర్స్. తెలుగుతోపాటు పాన్ ఇండియా భాషల్లో విడుదల చేసిన టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది.





## పెళ్లి తర్వాత లైఫ్‌లో థ్రిల్ కావాలా?.. అయితే టీజర్ చూసేయండి!


టాలీవుడ్ హీరో ప్రియదర్శి పులికొండ నటిస్తోన్న తాజా చిత్రం 'ప్రేమంటే' ఈ మూవీతో నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. థ్రిల్ ప్రాప్తిరస్తు అనేది సబ్ టైటిల్. ఈ సినిమాలో ఆనంది హీరోయిన్‌గా కనిపించనుంది. లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ చిత్రాన్ని జాన్వి నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించారు. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తే పెళ్లి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. పెళ్లి తర్వాత నా లైఫ్ థ్రిల్లింగ్‌గా ఉండాలి అంతే అని హీరోయిన్ చెప్పే డైలాగ్‌తో కథేంటో అర్థమవుతోంది. ఫుల్ లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమా నవంబర్ 21న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ ?మూవీకి లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చారు.

## మహేశ్ బాబు సినిమా ఈవెంట్.. ఓటీటీలో లైవ్

మహేశ్‌బాబు అభిమానులు గుంటూరు కారం సినిమా తర్వాత ఆయన్ను వెండితెరపై మళ్లీ చూసేందుకు ఆశ పడుతున్నారు. ఈ క్రమంలో రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న %ూవీదీ%29 ప్రాజెక్ట్ అప్‌డేట్ కోసం వారు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ఇప్పటికే నాలుగు షెడ్యూల్ పైగానే పూర్తి చేసుకుంది. ఒరిస్సా, కెన్యా, వంటి ప్రదేశాల్లో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంది. నైరోబి, టాంజానియాల్లో కొత్త షెడ్యూల్ కోసం ప్లాన్ చేస్తోంది. అయితే, నవంబర్ 16న సినిమా టైటిల్‌తో పాటు మహేశ్ ఫస్ట్ లుక్ విడుదల చేయనున్నారు. అందుకోసం గ్రాండ్‌గా ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ూవీదీ%29 ప్రాజెక్ట్ గురించి నవంబర్ 16న హైదరాబాద్‌లో ఒక భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేయాలని రాజమౌళి ఉన్నారట. సినిమా టైటిల్ గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయనున్నారని తెలుస్తోంది. అయితే, ఈ కార్యక్రమాన్ని అందరూ చూసేందుకు వీలు ఉండేందుకు ప్రముఖ %ుు% ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనుందట. ఈ అంశం గురించి త్వరలో అధికారికంగా ప్రకటన కూడా రావచ్చని తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో మహేష్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా , పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్స్‌తో పాటు మరికొందరు సెలబ్రిటీలు పాల్గొననున్నారని సమాచారం. ఇండియన్ సినిమా చరిత్రలో ఇప్పటివరకు చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి చూపించబోతున్నారు. శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2027 ప్రారంభంలో విడుదల చేయాలని చూస్తోంది.








## ఈ అవార్డ్ నా అభిమానులకు అంకితం

ప్రతిష్టాత్మక అవార్డ్‌ను తన అభిమానులకు అంకితమిస్తున్నానని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. ఇలాంటి ?అరుదైన గౌరవమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది అవార్డులు పొందిన వారికి హృదయపూర్వక అభినందనలు చెబుతూ ఐకాన్ స్టార్ ట్వీట్ చేశారు. 2024 ఏడాదిగానూ ప్రకటించిన దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ?అవార్డులను తాజాగా ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుల్లో మోస్ట్ వర్సటైల్ యాక్టర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా పుష్ప-2 మూవీకి గానూ ఉత్తమ సంగీత దర్శకుడిగా దేవీశ్రీ ప్రసాద్ అవార్డ్ దక్కించుకున్నారు. ఈ అవార్డ్స్‌లో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా సత్తా చాటింది. దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ - 2025లో ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. గతేడాది విడుదలై ప్రేక్షకుల్ని భయంతో పరుగులు పెట్టించిన శ్రద్ధాకపూర్ మూవీ స్త్రీ-2 ఉత్తమ చిత్రంగా అవార్డును దక్కించుకుంది. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా కార్తీక్ ఆర్యన్, కృతి సనన్ నిలిచారు. చందు ఛాంపియన్ చిత్రానికి గానూ ఉత్తమ దర్శకుడిగా కబీర్ ఖాన్, ప్రొడ్యూసర్ ఆఫ్ ది ఇయర్‌గా దినేశ్ విజన్ అవార్డులు సొంతం చేసుకున్నారు. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ చిత్రంగా లాపత్తా లేడీస్, ఉత్తమ నటీనటులుగా విక్రాంత్ మాస్సే, నితాన్షీ గోయెల్ అవార్డులు దక్కించుకున్నారు. ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్‌గా ఏఆర్ రెహమాన్ నిలిచారు.




## బాలయ్య - గోపీచంద్ మలినేని మూవీపై క్రేజీ అప్‌డేట్..

నటసింహ నందమూరి బాలకృష్ణ వయసు 60 దాటినా కూడా యాక్షన్ మోడ్‌లో దూసుకెళ్తున్నారు. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ, తన మరోసారి చాటుకుంటున్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ భారీ విజయాన్ని అందుకుంది. ఆ చిత్రానికి సీక్వెల్‌గా అఖండ 2 సిద్ధమవుతుండగా, బాలయ్య %-% బోయపాటి కాంబినేషన్‌లో ఇది నాలుగో సినిమా కావడం విశేషం. ఈ సినిమా డిసెంబర్ 5న భారీ అంచనాల మధ్య ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇదిలా ఉంటే, బాలకృష్ణ తదుపరి ప్రాజెక్టు %చీదీఖ% 111 గురించి కొత్త అప్‌డేట్ వెలువడింది. వీర సింహారెడ్డి తర్వాత మళ్లీ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలయ్య నటించబోతున్నారు. వృద్ధి సినిమాస్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేస్తూ .. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది రేపు వెల్లడించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. "రేపు మధ్యాహ్నం 12:01 గంటలకు చరిత్ర యుద్ధభూమి దాని రాణిని స్వాగతించడానికి సిద్ధంగా ఉంది. సామ్రాజ్యం రేపు ఆమె గంభీరమైన రాకను చూస్తుంది" అని క్యాప్షన్ జోడించారు. పోస్టర్లో బీభత్సమైన యుద్ధభూమి దృశ్యం, వెనుక వరల్డ్ మ్యాప్‌తో కూడిన లుక్ చూపించారు. ఇది చూసి అభిమానులు ఈ సినిమా చారిత్రాత్మక నేపథ్యంతో రూపొందుతోందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నయనతారను ఈ చిత్రంలో రాణిగా చూడబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, దానిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. రేపటి మధ్యాహ్నం అసలు విషయం తెలిసిపోనుంది. ఎస్. థమన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ %చీదీఖ% 111 హిస్టారికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. బాలకృష్ణను మరోసారి ఓ శక్తివంతమైన పాత్రలో చూడబోతున్నామనే ఉత్సాహం అభిమానుల్లో వెల్లివిరుస్తోంది. ఈ సినిమాతో బాలయ్య మరోసారి తనలోని నట విశ్వరూపాన్ని చూపించబోతున్నట్టు అర్థమవుతుంది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332